**PRAMUKHANDHRA** 32nd Year of Publication We carry the news and views of Telugus

32 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు

₹. 15
జనవరి 2026



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA









The One Stop solution for all your Printing Needs

**GOTETI GRAPHICS**

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA

✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

*Our print support creates a remarkable value in your business*




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2026

సంపుటి : 32 **373** సంచిక : 1




ప్రపంచంలోనే మొట్టమొదటి తెలుగు భాషా, సాంప్రదాయ, సాహిత్య, సనాతన ప్రబోధ ప్రచార పంపిణీ పత్రిక. ధర్మ ప్రబోధ విశ్లేషణ చేస్తూ ప్రపంచంలోని నలుమూలల్లో ఉన్న తెలుగు వారందర్నీ ఏకీకృతం చేస్తున్న ఏకైక తెలుగు భాషాసాంస్కృతిక మాసపత్రిక 'ప్రముఖాంధ్ర' శాశ్వతనిధికి మీ వంతు కనీస సహాయాన్ని ఎందరైననూ ఎంతైననూ కలిసి పంపవచ్చు. 10,116లకు పైగా, రు.15,000 ల్నుంచి రు.25,000, 50,000 మించీ పంపినవారిని, ఆ సంచిక ప్రదాతలుగా ఫొటోలతో సహా ప్రకటిస్తాం.

## క్రోధావేశాలు అరికట్టింపచేసే నాయకులూ లేరు, గురువులూ లేరు!

లోకాలను జయించే శక్తిని సంపాదించావు గానీ, నీలో తిష్టవేసుకున్న త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణేంద్రియాలు కల్పించే శబ్ద, స్పర్శ, రూప, రస గంధాది విషయాలను జయించలేవు అంటాడు బాలుడైన ప్రహ్లాదుడు. నిజమే కదా– మనల్ని ఆవహించుకున్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు, వీటిలో ఆరూ గానీ, ఒక్కటైనను గానీ లేని మనుష్యులుండరు. కానీ ఏ మఠాధిపతియో, స్వామీజీయో వచ్చారనే సరికి ఫల పుష్పాదులతో, ఇంకా డబ్బు ఉంటే పట్టు వస్త్రాలు, పట్టు అంగీలతో వెడలి దర్శిస్తారు.

భగవంతుని గుడికైతే ధనపు కట్టలూ, తాపడానికి బంగారపు ముద్దలతోనూ వెడతారు.

చదువుకొంటామన్నా, జీవితంలో సుఖపడే పథము నేర్పరచు కొంటున్నామన్నా, తీరని వ్యాధితో సతమతమై పోతున్నామన్నా, అటువంటి పేదలకు చిల్లు గవ్వ యివ్వరు.

అందరిలోనూ భగవంతుడున్నాడనే వేదాంతాన్ని చెబుతారు. ఆచరణలో పెట్టరు. అందుకే భగవాన్ సత్య సాయిబాబా వారన్నారు:

ప్రతీ ఒకరూ నిరంతర ఆత్మవిమర్శతో, ధీర గుణంలో, సహనంలో, ఉదారగుణం ఆచరణంలో సుంతైనా పెడుతున్నామా? ప్రేమగుణాన్ని అలవరచుకుంటున్నాం. ధర్మంగా, సత్యంగా, నీతి మార్గంలో నడవడానికి ఎంతగా ప్రయత్నిస్తున్నామన్నది ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి!

ఈ పృధ్వి అన్నది మహా సంస్థ. తీరికలేని, విరామంలేని యంత్రశాల. ఇక్కడ ప్రేమ, సత్యం, శీలం, అనేవి మనుషునిలో ఉత్పన్నమయితే ప్రతీ ఒకరిలోనూ శాన్తి నెలకొంటుంది. ప్రేమను ఉత్పాదనం చేసి దాని అవసరం కల లక్షలాది జనులకు పంచగలుగుతుంది. బయట ప్రపంచానికి కూడా ఎగుమతి చేయగలుగుతుంది. ప్రతీ ఒక్కరమూ సమృద్ధిగా అనుభవించగలం.


కఠిన హృదయాన్ని కరిగించేది ప్రేమ. స్వేచ్ఛా పూరితమైన పరిపూర్ణమైన, నిస్వార్థమైన ప్రేమ లేకపోతే ఆధ్యాత్మిక సాధన సాధ్యంకాదు, సఫలం కాదు. అదిలేనినాడు ఈ నామ సంకీర్తనలూ, సత్సంగములూ దండగ. భగవద్గీత కూడా ఇదే చెప్పింది:

**కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిష వైరిణమ్॥**

ఈ కామక్రోధాలనేవన్నీ రజోగుణం నుంచి పుడతాయని ఇవన్నీ జీవన వైరములనీ జగద్గురుడు శ్రీకృష్ణభగవానుడు నుడివియున్నాడు.

సర్వసాధారణంగా మనుజునిలో క్రోధావేశాలు జనించకుండా ఉండవు. క్రోధాలెలాటివన – 'సత్పురుషుని క్రోధం నీటి మీద వ్రాసిన వ్రాత లాంటిది, రెండవ క్రోధం ఇసుకమీద వ్రాతలాంటిది. రెండూ కొట్టుకుని పోతాయి. మూడవ రకమైన క్రోధం ఉన్నదే అది శిలమీద చెక్కడం వంటిది. కావున చాలాకాలం వరకూ పోదు.

ఇప్పుడు జనశ్రేణిలో మూడో రకం క్రోధములే ఉన్నాయ్. ఇది నాది, నీది కాదు– అనే ప్రగాఢ మోహ వ్యామోహాలు స్పర్థలనూ, కాపేషాలనూ పుట్టిస్తు న్నాయ్. అగ్నిలో ఆజ్యం పోసి నట్టు భుగభుగ సెగమంటలు రేకెత్తిస్తున్నాయ్. కలిసి బ్రతికే విధానాన్ని కత్తితో ముక్కలు కోసినట్టు ముక్కలూ, వ్రక్కలూ కావిస్తున్నాయ్. సరియైన బోధకుడూ, చోదకుడూ, నాయకుడూ లేకపోవడమే ఇందుకు కారణమేమో అనిపిస్తుంది.



బుధజన విధేయుడు

**– గోటేటి శ్రీరామారావు**

(ఆగస్ట్ 2016)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**





# తిరుమల వేంకటేశుని అద్భుత లీల !

**ప్రముఖాంధ్ర జనవరి సంచికను ఎలవ్వుడు తిరుమలేశుని ముఖచిత్రం తో అయన లీలను ప్రస్తావించడం ఆనవాయితీ. ఈ 2026 న నాకు పై వి ఆర్ కె ప్రసాద్ గారి "నాహం కర్తా హరిః కర్తా" పుస్తకంలోని ఈ అద్భుత లీల మనసులో మెదిలింది. అన్నీ మనమే చేస్తున్నాం అనుకుంటాం , కానీ చేసేది చేయించేది ఆయనే. ఆ తిరుమలేశుడే , ఆ శ్రీనివాసుడే !**

శ్రీవారి ఆలయంపై వున్న ఆనంద నిలయం విమానాన్ని పాలిష్ చేయడం సహా అనేక మరమ్మత్తు పనులు చేపట్టాం. అకస్మాత్తుగా ఒక రోజు ఇంజనీర్ వచ్చి, ఖంగారు ఖంగారుగా చెప్పాడు. "ధ్వజస్థంభం పుచ్చిపోయింది."

... మెల్లగా బంగారు తొడుగులు తీస్తుంటే, ఆ మాను క్రింద కంటా పుచ్చిపోయి ఉంది. మరి ఎలా నిలబడింది ?

ధ్వజస్థంభంపై నున్న బంగారు తొడుగులు ఆధారంగా మాత్రమే... పుచ్చిపోయిన ధ్వజస్థంభంతో స్వామికి సేవలా? అపచారం జరిగిపోతోంది. నాకు ఆందోళన ... ఆదుర్దా... ఆరాటం... భయం... రికార్డుల ప్రకారం చూస్తే, పాత మాను ఎప్పుడు పెట్టారో ఆధారాలు లభించలేదు...

మాకు లభ్యమైన గత 180–190 సంవత్సరాల రికార్డులో ఎక్కడా ఈ ధ్వజస్తంభం ప్రస్తావనే లేదు. అంటే ఇది ఎంతపాతదో? ఇప్పుడేమిటి చేయాలి?...50–75 అడుగుల ఎత్తయిన టేకు మ్రానుని సంపాదించి ప్రతిష్టించాలి. ఆ మ్రానుకి తొర్రలు ఉండకూడదు. కొమ్మలు ఉండకూడదు. ఎలాంటి పగుళ్ళు వుండకూడదు. దానికి వంపు ఉండకూడదు. నిటారుగా ఉండాలి. నిస్పృహ వస్తోంది. ఇది జరిగేదేనా?

అయినా ఆశ చావలేదు. క్షణాల మీద మన రాష్ట్ర ప్రభుత్వ అటవీ శాఖ అధికారుల్ని సంప్రదించాను. "ఇలాంటి లక్షణాలుండే టేకు చెట్లు మన రాష్ట్రంలో దొరకడం అసాధ్యం" అని తేల్చారు. కర్నాటకలోగానీ, కేరళలోగానీ పడమటి కనుమల అడవుల్లో దొరకవచ్చు అని కూడా స్పష్టం చేశారు. ఇవన్నీ వినేసరికి నాకు నీరసం వచ్చేసింది. ఈ లోపల ధ్వజస్థంభం క్రింద నిధి ఉందని మీడియా మిత్రుల ప్రచారం !!

ఒక నిర్వేదం చుట్టుముట్టేసింది దిక్కు తోచని ఆ స్థితిలో ఆ శ్రీనివాసుడే శరణ్యం అనుకున్నాను అలా ఆలోచిస్తూనే ఆ రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో ఇక ఆలయం నుండి బయల్దేర బోతుండగా, బెంగుళూరు నుంచి అయ్యంగార్ అనే భక్తుడు నాకోసం టెలిఫోన్ చేశారు. అసహనంగానే ఆ ఫోన్ అందుకొని నేను మాట్లాడగానే, ఆయన ప్రవాహంలాగా చెప్పుకుంటూ పోతున్నాడు.... "అయ్యా, మీరు ధ్వజస్తంభాన్ని మార్చాలనుకుంటున్నారని రేడియాలో విన్నాను. అలాంటి

ధ్వజస్తంభానికి మాను కావాలంటే కనీసం 280-300 సంవత్సరాల వయసున్న టేకు చెట్టు కావాలి. కర్నాటకలోని దండేలి అడవుల్లో మాత్రమే అది దొరికే అవకాశంవుంది.... ఇక్కడి అటవీశాఖ ఛీఫ్స్ కన్సర్వేటర్స్ నాకు మిత్రుడు.... మీరు అనుమతిస్తే, నేను నా మిత్రుడి సహాయంతో అడవుల్లో గాలించి అలాంటి చెట్టుని ఎంపిక చేయిస్తా. మీరు ఒక లెటర్ ఆయనకి వ్రాయండి. మిగతా సమన్వయం బాధ్యత అంతా నాకు వదిలేయండి."

అంతే, మరుక్షణం నేను అక్కడే ఆలయంలో కూర్చునే, కర్నాటక ఛీఫ్ సెక్రటరీతో, ఛీఫ్ కన్సర్వేటర్ తో లాంఛనప్రాయంగా టెలిఫోన్‌లో మాట్లాడి, వాళ్ళ హామీ కూడా తీసుకున్నాను. ఇదంతా అయ్యేసరికి రాత్రి 11 గంటలు దాటింది....

బెంగుళూరులో అయ్యంగార్ ప్రోద్బలంతో ఛీఫ్ కన్సర్వేటరూ, వారి సిబ్బందీ గాలింపు జరిపి, ఒక వందచెట్లు పరీక్షించాక, దండేలి ప్రాంతంలోని కొండవాలుల్లో ఒక పదహారు టేకుచెట్లు వరకూ మాకు పనికి రావచ్చని తేల్చారు. సరిగ్గా అదే వారంలో కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ గుండూరావు సకుటుంబంగా తిరుమలకు రావడం, నేను ఈ ధ్వజస్తంభం విషయం వారికి చెప్పడం, ఆయన వెంటనే "నూతన ధ్వజస్తంభం మానుని టిటిడికి కర్నాటక విరాళంగా తీసుకోండి" అని ప్రకటించడం జరిగిపోయాయి.

ఆ వారాంతంలో నేను, మా ఇంజనీర్లతో కలిసి వెళ్ళి, అయ్యంగార్, ఛీఫ్ కన్సర్వేటర్ వెంటరాగా, ఆ 16 టేకు చెట్లు పరీక్షించాం. చివరకివాటిల్లో మా కంటికి కనుపించినంతవరకు ఆరు చెట్లు మాత్రమే నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా వున్నాయి. వాటిల్లో రెండు మా అవసరానికి మించిన ఎత్తులో వున్నాయి.నేను టిటిడి అవసరాలు దృష్టిలో వుంచుకొని మొత్తం ఆరు చెట్లూ మాకే కావాలన్నాను.

అద్భుతం ! బెంగుళూరుకు తిరిగివచ్చి, ముఖ్యమంత్రిని, ఛీఫ్స్ సెక్రటరీని కలిసి మాట్లాడితే, ఆ ఆరు చెట్లూ విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతే, చెట్లు నరకడం ఆరంభమైంది. కానీ అప్పుడే ఎదురైంది - మరో జటిలమైన సమస్య.... ఆ ఎత్తుపల్లాల అడవుల్లో కొన్ని కిలోమీటర్ల దూరం వస్తేగాని మెయిన్ రోడ్డు రాదు. అంతదూరం వాటిని మోసుకుంటూ తేవటం ఎలా ?

విచిత్రం! ఆ అడవిలో సోమానీ వారి పేపర్ మిల్లుకోసం కలప నరికే వాళ్ళకి తెలిసింది మా హడావుడి అంతా. ఆ మిల్లు యాజమాన్య, సిబ్బందీ వచ్చేశారు. "అయ్యా! ఈ పని మాకు వదిలేయండి. ఇది శ్రీనివాసునికి మా సేవగా భావించండి" అంటూ ఆ కార్యభారం వాళ్ళు తలకెత్తుకున్నారు. ఇంక చెప్పేదేముంది.

వారం రోజుల్లో చెట్లు నరకటం, వాటిని సోమానీ మిల్లు సిబ్బంది - తాళ్ళు, కప్పీలు, గొలుసులు వగయిరా సామగ్రి వుపయోగించి రోడ్డు మీదకు చేర్చటం పూర్తయిపోయింది. ఈ లోపల అయ్యంగార్స్ మళ్ళీ చొరవ తీసుకుని, ఒక 16 చక్రాలుండే పొడవాటి ట్రక్‌ని మాట్లాడాడు.

రెండురోజుల్లో ఆరుమానుల్నీ తీసుకుని ఆ ట్రక్ బెంగుళూరు వచ్చింది. అక్కడ విధానసౌధ దగ్గర చిన్న పూజా కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి వాటిని టిటిడికి విరాళంగా ఇస్తున్నట్లు లాంఛనప్రాయంగా ప్రకటించి, నా చేతికి అప్పగించారు. వేలాది ప్రజల సమక్షంలో జరిగిన ఆ అప్పగింతలో ఆ మానుల్ని తాకగానే అనిర్వచనీయమైన ఆనందంతో నా ఒళ్ళు పులకించింది. (ఎందుకలా?).......

ఆ మర్నాడు సాయంత్రం నాలుగు గంటలకే ట్రక్ తిరుపతి చేరుకుంది. వూరి బయట డెయిరీ ఫారం దగ్గర వేలాది స్త్రీ, పురుషులు గుమికూడారు. ఆ మానులు రాగానే హారతులిచ్చారు. 'గోవిందా, గోవిందా' అనుకుంటూ తన్మయత్వంతో నినాదాలు చేశారు. మరో గంటలో ఆ ట్రక్స్ ఘాట్ రోడ్డు మొదలుకి (అలిపిరి) చేరుకుంది.

అక్కడిదాకా అంతా ఆనందమే. డ్రైవర్ ట్రక్ దిగాడు. కొండకేసి చూశాడు. ఘాట్‌రోడ్డు 18-19 కిలోమీటర్ల దూరం.... ఏడెనిమిది సంక్లిష్టమైన మలుపులు.... నా దగ్గరకు వచ్చాడు.

"సర్, ఇది నా జీవితంలో ఒక గొప్ప సాహసం. ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రక్ ఆపకుండా కొండమీదకు నడపగలగాలి. అలా నడిపితేనే నాకు సంతృప్తి. మధ్యలో ఘాట్‌రోడ్డు పిట్టగోడలు దెబ్బతినొచ్చు. ట్రెయిలర్స్ తగిలి బండరాళ్ళు దొర్లిపడొచ్చు. ఎన్నిరోజులు పడుతుందో తెలీదు.ఏమైనా కానీ, నేను ఇది చేసి తీరాలి."

నేను హామీ ఇచ్చాను-"బండలు విరిగిపడినా, పిట్టగోడ కూలిపోయినా, నీకు బాధ్యతలేదు. అదంతా మేం చూసుకుంటాం...." (అక్కడికేదో అంతా మేమే చేస్తున్నట్లు, మా శక్తితోనే అంతా నడిచిపోతున్నట్లు ఆత్మవిశ్వాసం. నిజమా?)

ఈ లోపల తిరుమలకి వెళ్ళే ట్రాఫిక్ ని కూడా (క్రిందకి దిగే) పాత ఘాట్ రోడ్డు మీదకి మళ్లించాము.

మొత్తంమీద ఆ సంధ్యా సమయంలో అరుణ కాంతుల వెలుగులో ఆ టేకుమానులు భగవంతుని ముంగిట్లో ధ్వజస్తంభాలుగా మారటం కోసం ఆ ట్రక్‌మీద ఘాట్ రోడ్డులో ప్రయాణం సాగించాయి....

భయపడినట్లుగానే ట్రక్ మలుపుతిరిగినప్పుడల్లా కొన్నిచోట్ల ట్రెయిలర్ పైన మానులు కొండని కొట్టుకుని బండలు పడ్డాయి. కొన్ని మలుపుల్లో లోయవైపున్న పిట్టగోడకూలిపోయింది.... మరికొన్ని మలుపుల్లో ట్రెయిలర్స్ వెనకాల ఒకవైపు చక్రాలు పిట్టగోడని గుద్దేసి, లోయ మీంచి దూకేశాయి. వెనకాల కారులో వెళ్తున్న నాకూ, మాఇంజనీర్లకీ ఈ ఫీట్లు చూస్తుంటే ఒళ్లు జలదరిస్తోంది. ఒకటి రెండు వలుపుల్లో సగం ట్రెయిలర్ లోయ అంచుమీంచి గెంతినట్లే అయింది. "అc అc.." అనుకుంటూ వెనకాల కార్లలో మేం ఆందోళనతో వూగిపోతున్నాం.ఏ మలుపులో నయినా ట్రెయిలర్ క్రిందపడిపోతే.... ! ఇలాంటి ఆలోచనలు నాలో టెన్షన్స్ పెంచేస్తున్నాయి. క్షణాలు- నిముషాలు - గంటలు దొర్లిపోయాయి. "గోవిందా ... గోవిందా ..."

గంటలు కాదు. ఒక గంట దొర్లేలోపలే, అంటే 55 నిమిషాల్లోనే ఫీట్లు చేసుకుంటూ, మా సంభ్రమాశ్చర్యాలమధ్య ధ్వజస్తంభాల మానులతో ట్రక్ తిరుమలకి చేరిపోయింది.

ఒక్కసారిగా వందలాది భక్తులు, టిటిడి ఉద్యోగులు ఆనందోత్సాహాలతో చేస్తున్న "గోవిందా-గోవిందా" పిలుపులతో తిరుమల గిరులు ప్రతిధ్వనించాయి.

నా కళ్లని నేనే నమ్మలేకపోతున్నాను.నాలో ఆనందపు అలలు పొంగి ఆకాశాన్ని తాకుతున్నంత ఉద్వేగం కలిగింది. నాకు తెలీకుండానే నా కంట్లోంచి ఆనంద (భక్తి) బాష్పాలు రాలుతున్నాయి. ఆ ఆనంద రసానుభూతిలో కొన్ని క్షణాలపాటు చేష్టలుడిగి అలా వుండిపోయాను!! ఏమిటా అద్భుతం! సూర్యాస్తమయం ఆరంభమయ్యే సమయంలో అలిపిరిలో బయల్దేరిన ట్రక్, సూర్యుడు పశ్చిమాద్రిన పూర్తిగా అస్తమించే సమ



యానికి కొండకి చేరిపోయింది. ఇంకా విచిత్రం, ట్రక్ యజమాని మావెనకాలే కారులో వచ్చి నమస్కారం పెడుతూ అన్నాడు – "స్వామి వారికి ఇంత గొప్ప సేవ చేసే అవకాశం లభించడం నా అదృష్టం. అందుకే నేను ఒక్క నయాపైసా కూడ రవాణా ఛార్జీలు తీసుకోవటం లేదు". (అతనికా ప్రేరణ ఎక్కడ్నుంచి కలిగింది?) – అయ్యంగార్‌ని, ట్రక్ యజమానిని, డ్రైవర్‌ని వేదపండితుల ఆశీర్వచనాలమధ్య, ప్రత్యేక దర్శనంతో, శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించాం.

మరి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించడం ఎలా? – అలా రోజంతానేనూ, మా ఇంజనీర్లు, అధికారులూ తలలు బద్ద య్యేలా అర్ధరాత్రిదాకాచర్చలు జరిపి, ఇక జరిపే శక్తిలేక మర్నాటికి వాయిదా వేసుకుని వెళ్లిపోయాం. నాకు ఒక పట్టాన నిద్ర రాలేదు. మూడు వారాల పాటు అష్టకష్టాలు పడి టేకు మానులు తీసువచ్చాక, వాటి ప్రతిష్ఠ ఎలా చేయాలీ అన్నదానిమీద ఇంత తర్జనభర్జన ఎందుకు జరుగుతోంది? ఇంతమంది ఇంజనీర్లు, మేధావులం కలిసి కూడా ఈ చిన్నపని చేయలేకపోతున్నామా?ఎందుకు చేయలేకపోతున్నాం... ?

అలా ఆలోచిస్తుంటే, అప్పుడే మళ్లీ స్ఫురించింది – "ఏ శక్తి ఇంతపని చేయించిందో, ఆ శక్తి మిగతా పనికూడా చేయించదా?... ఈ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠింపజేసే ప్రాప్తం నాకుంటే నా చేతుల మీదుగా జరుగుతుంది. లేకపోతే లేదు.." ఈ ఆలోచన రాగానే మనసు కుదుటపడింది. ప్రశాంతంగా నిద్రపోయాను.

అందుకు భిన్నంగా జరగలేదు. ఉదయం చర్చల్లో కూర్చున్న కొద్ది సేపట్లోనే ఎవరో అన్నారు – "ఎందుకండీ ఇదంతా, మానుని మహ ద్వారంలోంచి మోసుకువచ్చేటప్పుడే దాని తలభాగం వీలైనంత ఎత్తుకి లేపి వుంచుతూ, మొదలు భాగం నేలమీదకే వుంచుతూ, ఏతాం ఆకారంలో తీసుకువద్దాం. అది సరిగ్గా మంటపం క్రిందకు వచ్చేసరికి, దాన్ని ఆ రంధ్రంలోంచి పైకి దోపుదాం. మన పాపనాశనం డామ్స్ కడుతున్న ఇంజనీరింగ్స్ సిబ్బంది, అక్కడి కళాసీల సహాయం తీసుకుందాం.."

బ్రహ్మాండమైన ఆలోచన. (ఎక్కడిదీ ప్రేరణ?) ఆగమేఘాల మీద ఇంజనీర్లు కొలతలు వేసి, మహద్వారం లోపల్నుంచి బలిపీఠం వరకు నేలని లోతుగా తవ్వుకుంటూ వెళితే, ఈ ప్లానుని అమలు చేయటం సాధ్యమవుతుందని తేల్చారు. పైగా మహద్వారానికీ, బలిపీఠంకీ మధ్య ఎంత తవ్వినా, ఏం చేసినా యాత్రికుల వరుసలకి ఏమాత్రం అవరోధం వుండదనికూడా స్పష్టం చేశారు.

ఇంక ఆలస్యం చేయలేదు. ముహూర్తం చూసి, **HCL** ఇంజనీరింగ్ సిబ్బంది, కళాసీల సాయంతో ధ్వజస్తంభానికి ఎంచుకున్న టేకు మానుని సన్నిధి వీధిలోంచి, గొల్లమండపంలోంచి, మహద్వారంలోంచి ఆలయంలోకి ప్రవేశపెట్టాం. అక్కడ్నుంచి మానుశిఖర భాగం మంటపం పై కప్పును చూస్తూ లేచేలా ఎక్కడికక్కడ సర్వే బాదులతో స్టాండ్స్‌లు ఏర్పాటు చేశారు. మెల్లగా కళాసీలు మానుని ముందుకు తోస్తుంటే, అది అలా అలా లేచి సరిగ్గా మంటపం పై కప్పులో రంధ్రాన్ని క్రిందనుంచి చేరుకుంది. మహద్వారం దగ్గర్నుంచి బలిపీఠం దాకా నేలమీద గోతిలో మాను మొదలుని ముందుకు తోసుకు వెళ్తుంటే, ఇంజనీర్ల నైపుణ్యం ఫలించి, ఆ మాను శిఖరం మంటపం పైన రంధ్రం లోంచి పైకి, ఆకాశాన్ని చూస్తూ లేచి నిటారుగా నిలబడింది. మంటపం ఏ మాత్రం దెబ్బతినకుండాఆ సాయంత్రానికల్లా దండేలీ అడవుల్లోని టేకుచెట్టు తిరుమలేశుని ఆలయంలో ధ్వజస్తంభంగా ప్రతిష్ఠకు సిద్ధంగా నిలబడింది.

అద్భుతం ! ఏమా శ్రీనివాసుడి కరుణ..?

అప్పుడే ఓ చిన్న కొసమెరుపు !

ధ్వజస్తంభం క్రింద శాస్త్రానుసారంగా నవరత్నాలు, నవ ధాన్యాలు వగైరా వుంచాలన్నారు. అవి రెండు పెట్టెల్లో పెట్టి ధ్వజస్తంభం క్రింద పునాది భాగంలో పెట్టాం. అకస్మాత్తుగా నాకు ఏదో తోచింది. వెంటనే నామెడలో శ్రీనివాసుని డాలర్స్‌తో వున్న గోల్డ్ చైన్స్ తీసి ఒక పెట్టెలో వేశాను. క్షణాల్లో చుట్టూ చేరివున్న అర్చకులు, మిరాసీదార్లు, విఐపిలు, ఇతర భక్తులు కూడా ముందుకు వచ్చారు – శ్రీవారి ధ్వజస్తంభానికి తమ భక్తి పూర్వక బహుమానం ఇవ్వటానికి. అంతే! ఉంగరాలు, చైన్‌లు వగయిరా ఆభరణాలతో మరో పెట్టె నిండిపోయింది. అలా ఆ పెట్టెల్ని నిక్షిప్తం చేసి, వాటిపై కాంక్రీట్స్ పోశాక, దానిపైన ధ్వజస్తంభాన్ని సరిగ్గా 90 డిగ్రీల కోణంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠింపజేశాం (పాత ధ్వజస్తంభం మానుని పాపనాశనం డామ్‌లో వేదోక్తంగా విశ్ర

మింపజేశాం) ఒక నెల రోజులకి నూతన ధ్వజస్తంభానికి ప్లాట్‌ఫారమ్ నిర్మాణం, పైన బంగారు ప్లేట్లు తొడగటం, శిఖర భాగాన పతాకాన్ని నిలబెట్టడం, ధ్వజస్తంభానికిముందు బలిపీఠం నిర్మించడం పూర్తయ్యాయి.

ఒక మినీ బ్రహ్మోత్సవం తలపెట్టి (మిగతా అన్ని మరమ్మతులు, బంగారు ప్లేట్లకు మెరుగు పెట్టడాలు వగయిరా అన్నీ పూర్తిచేశాక), ఆ బ్రహ్మోత్సవంలో భాగంగా ఆస్థాన పండితుల ఆశీర్వచనాల మధ్య, వేద మంత్రోచ్చారణలతో తిరుమల గిరులు ప్రతిధ్వనిస్తుండగా 1982 జూన్ 10న ధ్వజస్తంభాన్ని, బలిపీఠాన్ని పవిత్రం చేశారు.

ఇది జరిగిన ఆరో రోజున (జూన్ 16న) నేను మరొకరికి పదవీ బాధ్యతలు అప్పగించి, బదిలీ అయి వెళ్లిపోయాను.

ఆ ఉదయం అలా బదిలీ అయి వెళ్లిపోతూ, దండకారణ్యం నుంచి వచ్చి ఆలయంలో స్థిరపడిన టేకు చెట్టు (ఇప్పుడది ధ్వజస్తంభం) కేసి చూశాను. పతాక భాగంలో గంటలు నన్ను చూసి పలకరిస్తున్నట్లుగా చిరు సవ్వడులు చేస్తూ వూగుతున్నాయి. ఏదో వింత అనుభూతి ...!

అక్కడే వున్న ఒక వృద్ధ పండితుడు చిరునవ్వు నవ్వి, ఒక శ్లోకం చదివారు :

**"నాహం కర్తా హరిః కర్తా**
**తత్పూజా కర్మ చాఖిలం**
**తదాపి మత్కృతా పూజా**
**తత్ప్రసాదేన నా అన్యథా"**

"నేను కాదు కర్తని. చేసేది చేయించేది అంతా ఆ శ్రీహరే. నా ద్వారా ఏ సత్కార్యం జరిగినా అది భగవంతుడి ప్రసాదమే తప్ప వేరేమీ కాదు." ❑

## గురువుపట్ల భక్తిలేనివారి జీవితంవ్యర్థం



"ఒక వ్యక్తి జీవితంలో ఎంత ముందుకు సాగినా, అతనికి తన గురువు పట్ల భక్తి లేకపోతే, అతని జీవితం వ్యర్థం" అని భగవద్గీత స్వయంగా అన్నారు. కాబట్టి, మనం ఎంత గొప్ప వ్యక్తి అయినా, ఎంత ఉన్నత విద్యావంతులమైనా, ఎంత ధనవంతులమైనా, మన గురువు పట్ల భక్తి ఖచ్చితంగా అవసరం.

"సంప్రదాయ పరిపాలన బుద్ధ"

శంకరులు తన గురువు గోవింద భగవత్పాదులకు అచంచలమైన భక్తితో సేవ చేశానని చెప్పినప్పుడు, మన గురువు పట్ల భక్తి మనకు కూడా ఖచ్చితంగా అవసరమని చెప్పనవసరం లేదు. మన గురువు పట్ల ఆ భక్తియే మనకు అన్ని రకాల గొప్పతనాన్ని తెస్తుంది. గొప్ప గురువు శ్రీ నృసింహ భారతి మహా స్వామి ఒకసారి ఇలా అన్నారు, "గురువు అనుగ్రహం లేకుండా, ప్రపంచంలో ఎవరు కోరికలను సాధించగలరు?

కాబట్టి,అన్నిఆనందాలకు,అన్నిమంచితనాలకు, అన్ని గొప్పతనాలకు మూలమైన గురువు పాదాలను పూజించండి." మనం ఇక్కడ గొప్పతనాన్ని పొందగలిగేలా అన్ని మహానుభావులు మనకు బోధిస్తారు. మనం వారి బోధనలను అనుసరించి మన జీవితాలను గడుపుతే, మనకు ప్రయోజనం కలుగుతుంది. మనం వారిని అనుసరించకపోతే, మనం నష్టపోతాము! వారికి ఏమీ లేదు!

--- జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారు

# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత **28** సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**
**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.**
**మొబైల్ : 98400 48941**

# కనిపించని నాలుగో సింహం... ఎం.ఎస్. గురుమూర్తి

**ఆయన మూర్తీభ'వించిన గురువు, పేరు గురుమూర్తి. నాకు లెక్కల గురువు. తన జీవితాంతం ఎంతో మంది విద్యార్థులను, క్రికెట్ క్రీడాకారులను తయరు చేసిన మహనీయుడు. మహోన్నతుడు. చెన్నై లోని తెలుగు ప్రముఖుడు. ఆయన గురించి నా స్నేహితుడు పార్థసారథి వ్రాసిన చక్కటి వ్యాసం.**

మన జాతీయ చిహ్నంలోని నాలుగు సింహాలలో మనకు మూడు మాత్రమే కనిపిస్తాయి. నాలుగో సింహం ఎప్పుడూ కనిపించదు. అదే విధంగా, వెలుగులోకి రాకుండా తెర వెనుకనే ఉండి, అత్యంత కీలకమైన పాత్ర పోషించే కొంతమంది వ్యక్తులు ఉంటారు. వారికి ప్రచారం ఇష్టం ఉండదు. కానీ తెర వెనుక నుంచి వారు నిర్వర్తించే బాధ్యతలు ఎంతో ప్రాముఖ్యమైనవి వారి ప్రభావం మన జీవితాలపై లోతుగా ఉంటుంది. అటువంటి మహానుభావుల్లో ఒకరు మా "గురు"



ఎం.ఎస్. గురుమూర్తి (మండలం సుబ్రహ్మణ్యం గురుమూర్తి). 1970 నుంచి 2025 వరకు దాదాపు ఐదున్నర దశాబ్దాల పాటు, మద్రాస్ (చెన్నై) లోని టి. నగర్‌లో క్రికెట్ టోర్నమెంట్లు మరియు గణిత శిక్షణ తరగతులను అసాధారణ నైపుణ్యంతో సమర్థవంతంగా నిర్వహించిన వ్యక్తి ఆయన. ఎం.ఎస్. గురుమూర్తి 1956లో తన స్నేహితుడు శ్రీనివాసన్‌తో కలిసి, తనకు కేవలం 14 ఏళ్ల వయసులో, వై.ఎస్.సి.ఏ (యంగ్ స్టార్స్ క్రికెట్ అసోసియేషన్) ను స్థాపించారు. గురుమూర్తి స్వయంగా ఒక క్రికెటర్ ః మీడియం పేస్ బౌలర్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కొన్నిసార్లు వికెట్ కీపింగ్ కూడా చేసేవారు. ఆయన తమిళనాడు రాష్ట్రం తరపున అండర్-25 క్రికెట్ ఆడారు. వృత్తిపరంగా ఆయన ఎల్.ఐ.సి (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) మద్రాసు లో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు పనిచేశారు. ఎల్.ఐ.సి లో ఆయన కేవలం ఉద్యోగి మాత్రమే కాకుండా, రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శిగా, యూనియన్ కార్యదర్శిగా నాయకత్వ బాధ్యతలు కూడా నిర్వర్తించారు. టి. నగర్‌లో సోమసుందరం గ్రౌండ్ పేరు చెప్పగానే ప్రజలకు గుర్తుకు వచ్చేది "గురు టీమ్"నే. పది సంవత్సరాల వయస్సు నుంచి ఇరవై ఐదు లేదా ముప్పై ఏళ్ల వయస్సు వరకు ఉన్న పిల్లలు, యువకులు ః గురు ఆధ్వర్యంలోని వివిధ జట్లలో క్రికెట్ ఆడేవారు. జట్లు క్రికెట్ మ్యాట్లు, నెట్లు, కార్క్ బాల్స్, పూర్తి ప్రొఫెషనల్ కిట్‌తో ఆడేవి. ప్రతిరోజూ సాయంత్రం 5:00 నుంచి 6:30 వరకు ప్రాక్టీస్ ఉండేది కొన్ని ఆదివారాల్లో మ్యాచ్‌లు నిర్వహించేవారు.

వార్షిక వై.ఎస్.సి.ఏ టోర్నమెంట్ ("వై.ఎస్.సి.ఏ ట్రోఫీ") 1970లో రామకృష్ణ మిషన్ గ్రౌండ్ (RKM గ్రౌండ్) లో 30 ఓవర్ల వార్షిక టోర్నమెంట్‌ను (వై.ఎస్.సి.ఏ ట్రోఫీ) ఆయన ప్రారంభించారు. కాలక్రమేణా ఇది ఎంతో ప్రజాదరణ పొందింది. ఒక దశలో ఈ టోర్నమెంట్ లో సుమారు 75 జట్లు పాల్గొనేవి కర్ణాటక, కేరళ, బొంబాయి (ప్రస్తుతం ముంబై) వంటి ఇతర రాష్ట్రాల జట్లు కూడా వచ్చేవి. వై.ఎస్.సి.ఏ నుంచి ఎంతోమంది క్రికెటర్లు ఫస్ట్ క్లాస్ క్రికెట్ స్థాయికి ఎదిగి ఖ్యాతి గడించారు.

ఆయన శిష్యుల్లో ఒకరైన కె. భరతన్ (రంజీ ఫైనలిస్ట్, తరువాత అంపైర్) మాట్లాడుతూ ః గురు నేర్పిన క్రమశిక్షణ, సమయపాలన, స్వావలంబన వంటి అలవాట్లు తన జీవితాంతం తనతోనే ఉన్నాయని చెప్పారు. నాణ్యమైన మైదానాల లభ్యత తక్కువగా ఉన్న రోజుల్లో, సోమసుందరం గ్రౌండ్ గురు నాయకత్వంలో చెన్నైలోని ఆశావహ క్రికెటర్లకు ఒక ఆసరా గా నిలిచింది మా వై.ఎస్.సి.ఏ టోర్నమెంట్లు అందరికీ ఎంతో గర్వంగా ఉండేవి. వేసవి సెలవుల్లో, టి. నగర్‌లోని జి.ఎన్. చెట్టి రోడ్డులో ఉన్న రామకృష్ణ స్కూల్ ప్లేగ్రౌండ్ (న్యూ గ్రౌండ్) లో ఈ పోటీలు నిర్వహించేవారు. తమిళనాడు నుంచే కాకుండా పొరుగురాష్ట్రాల నుంచి కూడా అనేక జట్లు పాల్గొనేవి. బ్రిజేష్ పటేల్, టి.ఈ. శ్రీనివాసన్, మైకేల్ డాల్వీ వంటి జాతీయ స్థాయి ఆటగాళ్లు, అలాగే అబ్దుల్ జబ్బార్, నటరాజన్, ధర్మలింగం (వారు ఐ.సి.ఎఫ్., చెన్నై తరపున ఆడారని నాకు గుర్తు) వంటి అనేక రాష్ట్ర స్థాయి ప్రసిద్ధ క్రికెటర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్లతో పాటు, గురు గ్రూప్‌కు చెందిన "రైజింగ్ స్టార్స్" అనే జట్టు తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ వారి లీగ్ మ్యాచ్‌లలో కూడా పాల్గొనేది. 1982-83లో భారత క్రికెట్ జట్టుకు ఫాస్ట్ బౌలర్‌గా ఆడిన టి.ఎ. శేఖర్, 1960-70 మధ్యకాలంలో గురు జట్టులో ఆటగాడిగా ఉన్నారు. రంజీ ఫైనల్స్ ఆడిన మాజీ తమిళనాడు కెప్టెన్ ఎస్. సురేష్, రైల్వేస్ తరపున రంజీ ఫైనల్ ఆడి తరువాత అంపైర్ అయిన కె. భరతన్, అంపైర్ కె. శ్రీనివాసన్ వీరందరూ తమ ప్రారంభ దశలో గురు యొక్క శిష్యులే. గురు తన సొంత డబ్బుతోనే క్రికెట్ జట్టును నడిపేవారు. ఆ రోజుల్లో మాలో ప్రతి ఒక్కరం నెలకు కేవలం పది రూపాయలు మాత్రమే చెల్లించేవాళ్లం ఆ డబ్బు చెల్లించని వాళ్ల సంఖ్య చెల్లించిన వాళ్లకంటే ఎక్కువే. అయినా గురు ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు. ఆయన ఇరవై సంవత్సరాలకు పైగా రామకృష్ణ స్కూల్‌కు క్రికెట్ కోచ్‌గా కూడా పనిచేశారు. ప్రతి ఆటగాడిని ఆయన పేరుతోనే ఆప్యాయంగా పిలిచేవారు. (నా ముద్దుపేరు రవి కావడంతో నన్ను మొదట B రవి అని పిలిచేవారు తరువాత నా ఇనిషియల్స్ తో BNV అని పిలవడం ప్రారంభించారు.)

గణిత ట్యూషన్ తరగతులు గురు గణితం బోధించేవారు. దాన్ని ట్యూషన్ అని పిలవడం కంటే ఉచిత శిక్షణ అని చెప్పడం సబబు. ప్రతిరోజూ ఉదయం 7:00 నుంచి 8:30 వరకు, అలాగే సాయంత్రం 7:00 నుంచి 9:00 వరకు గణిత తరగతులు నిర్వహించేవారు. నిజానికి, దీనిని కోచింగ్ అనడం కూడా తక్కువే. అది ఒక గణిత "అవధానం" లాంటిది. పది నుంచి పదిహేను మంది విద్యార్థులు ఆయన చుట్టూ కూర్చునేవారు వేర్వేరు తరగతులకు చెందిన విద్యార్థులకు క్రమపద్ధతిలో ఒక్కొక్కరికి గణితం బోధించేవారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే : ప్రతి విద్యార్థికి ఎక్కడ వరకు చెప్పారో ఆయనకు ఖచ్చితంగా గుర్తుండేది వాళ్ళ వంతు వచ్చినప్పుడు అక్కడి నుంచే మళ్లీ కొనసాగించేవారు. అనేక మందికి వరుసగా ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, ఎక్కడా తడబడని అవధాని లాంటి నైపుణ్యం కనబరచేవారు.

చేతిలో చిన్న కర్ర లేదా స్కేలు పట్టుకుని, క్రమశిక్షణ నేర్పే పాఠశాల ఉపాధ్యాయుడిలా బోధించేవారు. హాజరు పట్టిక పెట్టుకుని సరిగా రాని వారిని మందలించేవారు, అవసరమైతే శిక్ష కూడా విధించేవారు. చదువు లో బలహీనులైన ఎంతోమంది విద్యార్థులు గురు కోచింగ్ వల్ల మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. దాదాపు మూడేళ్ళు గురు తన లెక్కల ట్యూషన్ క్లాసెస్ మా ఇంటి అవుట్ హౌస్ లో నడిపా. మా ఇంటి యజమాని శ్రీ. పీ. ఎస్. వీ. ఆర్. ప్రసాద్ గురు దగ్గర అద్దె కూడా తీసుకోలేదు. ప్రసాద్ కి గురు బాగా పరిచయం. తరవాతి కాలం లో వారికి బంధుత్వం కూడా కలిసింది.

1974-77 మధ్యకాలంలో (9వ తరగతి నుంచి 11వ తరగతి వరకు) నేను ఆయన వద్ద గణితం నేర్చుకున్నాను. చదువులకు ఆటంకం కలుగుతుందనుకుని క్రికెట్ ఆడటం మానేస్తానని చెప్పినప్పుడు ఆయన చాలా కోపగించారు. క్రికెట్ ప్రాక్టీస్ మానేసిన తర్వాత నేను గణిత తరగతులకు కూడా వెళ్లడం ఆపేశాను.

ఒక రోజు నా బంధువు రాజగోపాల్ ద్వారా సందేశం పంపించి, మళ్లీ గణిత తరగతులకు రావాలని చెప్పారు. అయినా, నేను క్రికెట్ మానేయడంతో ఆయన నాపై నిరాశ చెందారు. నన్ను ఒక ఎడమచేతి ఆల్‌రౌండర్‌గా చూడాలని ఆయన ఆశించారు. మా వై.ఎస్.సి.ఏ వార్షిక స్మారక పుస్తకంలో నన్ను " లెఫ్ట్ ఆర్మ్ ఆల్ రౌండర్ అండ్ ఎలక్ట్రిక్ ఫీల్డర్"గా పేర్కొన్నారు. (వై.ఎస్.సి.ఏకు చెందిన ప్రతి ఆటగాడి పేరు, అతని క్రికెట్ లక్షణాలపై చిన్న వివరణ ఇవ్వడం ఆయన అలవాటు.)

గురు కుడిచేతికి గడియారం ధరించేవారు, ఉంగరాల జుట్టు, బెల్-బాటమ్ ప్యాంట్లు వేసుకుని, రాజ్‌దూత్ మోటార్‌సైకిల్ నడిపేవారు. ఆయన ఎం.జి.ఆర్‌కు(తమిళ సినీ నటుడు ఎం జీ రామచంద్రన్) వీరాభిమాని. యాభై సంవత్సరాలకు పైగా ఆయన ఒక వైపు క్రికెట్‌ను, మరో వైపు గణిత శిక్షణను అలుపెరుగకుండా నిర్వహించారు. గురు ఎప్పుడూ అందరికీ ఇచ్చేవారే గానీ, ఎవ్వరిదగ్గర ఏమీ తీసుకోలేదు ఏదీ అడగలేదు. అనేక మంది పేద విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారు అనేక మంది మంచి క్రికెటర్లయ్యారు ఇవన్నీ గురు మార్గదర్శకత్వం వల్లే ద్రోణాచార్యుడికీ వ్యక్తిగత స్వార్థం ఉంది : ద్రుపదుణ్ణి ఓడించేందుకు అర్జునుని తీర్చిదిద్దాడు. కానీ గురులో స్వార్థం రవ్వంతైనా లేదు. ఎప్పుడూ ఇంకా ఏదో చేయాలనే తపనతో కనిపించేవారు. వ్యాసుడు లోకహితార్థం వేదాలను విభజించి, పురాణాలు, ఇతిహాసాలు రచించాడు : ఎటువంటి వ్యక్తిగత లాభం లేకుండా. అదే విధంగా, మా అందరికీ గురు ఒక వ్యాసుడిలాంటి వారు. నేను గురును చివరిసారిగా 2022 డిసెంబరులో సోమసుందరం గ్రౌండ్‌లో చూశాను. 83 ఏళ్ల వయసులో, 13 నవంబర్ 2025న ఆయన పరమపదించడం మా పూర్వవిద్యార్థులందరికీ తీరని లోటు. మేమంతా ఒక మార్గదర్శకుడిని, ఉపదేశకుడిని, గురువును కోల్పోయాము. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. మాకు సోమసుందరం గ్రౌండ్ లో ఇప్పుడు ఏదో వెలితిగా అనిపిస్తుంది. గురు లేకుండా సోమసుందరం గ్రౌండ్‌ను ఊహించుకోవడమే అసాధ్యం.

డాక్టర్. బీ. యన్. వీ. పార్థసారధి

# ఆధునిక ప్రార్థన

ఓ భగవంతుడా, ఆసుపత్రికి వెళ్లే అవసరం రాకుండా చూడు! పోలీసు స్టేషన్ కు వెళ్లే సమస్య లేకుండా చూడు! కోర్టు మెట్లెక్కవలసిన కేసులు రాకుండా చూడు! ప్రజానాయకుడు దగ్గరకువెళ్లే పని లేకుండా చూడు ! మంత్రిగారిని కలవవలసిన ముప్పేమీ రాకుండా చూడు! రౌడీతో రాజీ పడవలసిన రోజు రాకుండా చూడు! దేవుడికి ముడుపులు కట్టవలసిన కోరిక కలగకుండా చూడు! పూజలు చేయవలసిన పాపాలు చేయకుండా చూడు! యజ్ఞాలు, హోమాలు చేయవలసిన ధ్యేయాలు లేకుండా చూడు! మొబైల్ మోసాల మాయలో పడనంత మెలుకువ ప్రాదించు! సైబర్ నేరగాళ్ల వలలో పడనంత ఆలోచన అందించు! విద్యుక్తధర్మం నిర్వర్తించే వివేకాన్ని అనుగ్రహించు! పర్యావరణాన్ని రక్షించే పట్టుదల ప్రసాదించు! మూగజీవులకు మమత పంచే మానవత్వం అనుగ్రహించు! వసుదైక కుటుంబం కాంక్షించే విశాలహృదయం ప్రసాదించు! సమస్యలను ఎదుర్కొనే సంయమనం అనుగ్రహించు! సంఘజీవిగా మెలిగే సంస్కారాన్ని ప్రసాదించు! విలువలు వెలిగించే వ్యక్తిత్వాన్ని అనుగ్రహించు! న్యాయాన్ని నిలబెట్టే నిబద్ధత ప్రసాదించు! అన్నార్తులకు అన్నంపెట్టే అవకాశం అనుగ్రహించు! అభాగ్యులను ఆదుకునే సమర్థత సమకూర్చు! అక్రమాలను అడ్డుకునే సంకల్పం ప్రసాదించు! ఆఖరిక్షణం వరకు నీ నామ స్మరణ జరిపే వరం ప్రసాదించు! ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ఎగిరిపోయే జీవితం అనుగ్రహించు!

- బిడివివి ప్రసాద్

# సరస్వతీ నది



సరస్వతీ నది అలహాబాద్ వద్ద త్రివేణి సంగమంలో అదృశ్యంగా కలుస్తుందని ఐహీకం. సరస్వతీ నది ఆవిర్భవించిన స్థలం బదరీనాథ్ సమీపాన భారతదేశంలో ని చివరి గ్రామమైన మనా. టిబెట్ సరిహద్దునకు 3 కి.మీ దూరంలో వున్నది. సరస్వతీ నది ప్రవేశ ద్వారం మనా గ్రామంలో వున్నది. వేద వ్యాసుడు చెప్పుండగా గణేశుడు వ్రాసిన మహాభారత కావ్యంలో పంచపాండవులు స్వర్గారోహణానికి బయలుదేరినది మనా గ్రామం నుండేనని తెలుస్తోంది. ఇటువంటి అతి ప్రాచీన విశేషాలు గురించి చదివినా , విన్నా మన శరీరం కుతూహలం తో పులకిస్తుంది.

పర్వత శ్రేణులలో ప్రవహించే అలకానంద అందం మనల్ని మైమరిపిస్తుంది. ప్రకృతి పచ్చదనాలతో నిండిన మనా గ్రామ మార్గమంతా స్వెట్టర్ లు , చలి టోపీలు అమ్మే దుకాణాలు, టీ హోటళ్ళు వున్నాయి. చలి ఎక్కువగా వుండడం వలన వేడి వేడి టీ తోనే ఎక్కువ కాలం గడుపుతారు. ఆ గ్రామ మహిళలు తమ భుజం వెనకాల బుట్టలలో పిల్లలను , వయోవృద్ధులనే కాకుండా గ్యాస్ సిలిండర్ లను కూడా మోసుకుంటూ వెళ్ళడం చూసే వారికి ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

వీరికి ఆరోగ్యాన్ని యిచ్చేది అక్కడి ప్రకృతియే. ఇక్కడకు వచ్చే పర్యాటకులు ముందుగా గజముఖ వినాయకుని గుహను దర్శిస్తారు. వ్యాసభగవానుని ప్రార్థనను మన్నించి , వినాయకుడు భారతం వ్రాసిన ప్రదేశం యిదే. అది కూడా తన దంతాన్ని ఊడపెరికి ఘంటంగా ఉపయోగించి వ్రాశాడు. గుహలో దర్శనమిచ్చేది ఆ వినాయకుడే అని చెపుతారు. గుహలో వొంగుని వినాయకుని దర్శించి వ్యాసగుహకి వెడతారు భక్తులు.

మహాభారతం వ్రాసిన పిదప వేదవ్యాసుడు మనో చాంచల్యంతో వున్న సమయాన, నారదుని బోధతో, మానవజన్మ మోక్షానికి భాగవతం వ్రాసినగుహ గా కూడా భక్తులు ధృఢంగా నమ్ముతారు. ఈ గుహ 5300 సంవత్సరాలకన్నా ప్రాచీనమైనదిగా చెప్తారు. ఇక్కడ, వినాయకుడు శుకుడు , వల్లభాచార్యుల పురాతన శిల్పాలు దర్శనమిస్తాయి. మహాభారతం యొక్క ఎనిమిది తాళపత్రగ్రంధాలు ఒక అద్దాల పెట్టెలో పెట్టి పూజించ బడుతున్నాయి. ఇక్కడే రెండు కొండలమధ్యనుండి ఉరుకు పరుగులతో నురగలు క్రక్కుతూ పెద్ద పెద్ద అలలతో సరస్వతీనది ప్రవహిస్తూంటుంది. అత్యంత వేగంతో ప్రవహించే ఆ అలల శబ్దంలో ఓంకార నాదం వినిపిస్తుంది.

అతి ప్రశాంతమైన వాతావరణంలో అథఃపాతాళంలో సరస్వతీనది జన్మస్థానం వున్నది. మహా ఉధృతంగా ఆవేశంతో, కళ్ళని కట్టివేసే శ్వేత వర్ణంతో సరస్వతీనది భ్రమింప చేస్తుంది. సరస్వతీనది బాహ్యంగా మాయమవడానికి గల కారణం ఒక కుతూహలమైన గాథ.

మహాభారత గ్రంథం వ్రాయడంలో నిమగ్నుడైన వినాయకుడు.. అతివేగంగా మహాశబ్దంతో ప్రవహించే సరస్వతి నదిని ప్రశాంతంగా వుండమని ఆదేశించాడు. కాని సరస్వతీ నది ఆహంకారంతో తన ప్రవాహ వేగాన్ని మరింత పెంచుకుని యింకా శబ్దాన్ని పెంచుకుంటూ ప్రవహించసాగింది. వినాయకుడు కోపంతో, "ఓ నదీ నీవు నామరూపాలు లేకుండా అదృశ్యమైపోతావు" అని శపించాడు.

తన తప్పును తెలుసుకున్న సరస్వతీ నది, తనని మన్నించమని కోరింది. అప్పుడు , గజముఖుడు ఆ నది మీద దయ తలచి, " ఓ సరస్వతీ ! యికపైన నీవు ఇక్కడ మరుగుననే ప్రవహిస్తూ గంగా , యమునలు సంగమించే ప్రదేశాలలో మూడవ నదిగా ప్రవహించి కీర్తి పొందుతావు అని అనుగ్రహించాడు. అందువలన, అలహాబాద్, గుప్తకాశి, ఋషీ కేష్ గంగా,

యమునలు కలసిన స్థలాలు త్రివేణీ సంగమాలుగా ప్రఖ్యాతి గాంచాయి. ఇక్కడ సమీపముననే సరస్వతీ నదికి చిన్న గుహాలయం వున్నది. గర్వం తొలగి అణిగిపోయిన సరస్వతి అలకానందా నదితో కలసి అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. అలకానందతో కలసే ప్రదేశం అత్యంత రమణీయంగా వుంటుంది.

ఈ ప్రదేశానికి కేశవ ప్రయాగ అని పేరు. సరస్వతీ నదీ జలాలను మనం అక్కడ వున్న కుళాయిలలో పట్టుకొనవచ్చును. దీనికి పైన పాండవులు స్వర్గారోహణ ప్రదేశం వున్నది. అక్కడ "భీమ్ బుల్" అనబడే భీముని బండ ఒకటి వున్నది. పాండవులు ఐదుగురు పాంచాలితో స్వర్గారోహణం చేస్తున్నప్పుడు మార్గమధ్యంలో తగిలే సరస్వతీ నదిని ద్రౌపది దాటలేనప్పుడు భీముడు ఒక బండరాయిని వంతెనగా వేసినట్టు పురాణ కథ. ఆ రాతి మీద భీముని హస్త చిహ్నాలు కనిపిస్తాయని వ్రాసి వుంటాయి. ఒక్క ధర్మరాజు తప్ప , మిగతా ఐదుగురు తమ దేహాన్ని అక్కడే వదలివేయగా , ధర్మరాజు మాత్రం తన దేహంతో , ధర్మస్వరూపమైన యమధర్మరాజు శునక రూపంతో మార్గ దర్శి కాగా పై లోకాలకు వెళ్ళగలిగాడు.

వారు వెళ్ళిన మార్గం , ఆ పర్వతారోహణ మెట్లు, సమున్నత పర్వతమార్గం ఈనాటికీ వున్నదని , ఆ ప్రదేశానికి చేరుకోవడం అత్యంత కఠినమని చెప్తారు. ఈ మనా గ్రామమే భారత దేశంలోని చివరి గ్రామం.... ❑

ఈ రెండు ఊర్లు భద్రాచలంలో ఉన్నాయి ఈ ఊర్లు పై భలే జోకులు ఉంటాయి తంత, తన్నించుకుంట ఈ ఊర్లు మధ్య ప్రయాణం, ఎలావుంటుందో ఊహించుకుని నవ్వుకుందాం. తంతానికి ఒక టికెట్ ఇవ్వండి. తన్నించుకుంటానికి రెండు ఇవ్వండి. సార్ చిల్లర ఇవ్వలేదు. తంతానికి వెళ్ళేవాడికే ఇవ్వలేదు. నువ్వు తన్నిం చుకుంటానికి కదా! చివరిదాకా వస్తావు కదా! కంగారుపడకు.

వెనుకసీట్లో అయన : ఏరాబ్బాయి! ఈ మధ్య తంతానికి రావట్లేదు.

లేదు బాబాయ్! తన్నించు కుంటానికి వెళ్లిపోతున్నా బాబాయ్.

అక్కడ ఆర్డర్లు వస్తున్నాయి.

సరేరా! తన్నించు కుంటా అలవాటు అయిపోయి, తంత మాటే మరిచిపోయావు,

ఇంతలోడ్రైవర్ : తంతానికి ఎవరైనా వున్నారా?

కండక్టర్ : ఒక్కరే తంతానికి, అందరు తన్నించుకుంటానికే.

బాబూ తన్నించుకుంటానికి అందరు టికెట్లు చేత్తో పట్టుకోండి.

అప్పుడే మెలుకువ వచ్చిన పాసింజర్ : తంతానికి దిగాలి ఇప్పుడు ఎలా?

కండెక్టర్ విసుగ్గా : ఇంకో ఇరవై ఇచ్చి తన్నించు కుంటానికి దిగు

బస్ దిగుతూ బాబాయ్ పిన్నిని తీసుకుని ఒకసారి తన్నించుకుంటానికి రండి.




# దైనందిన జీవితంలో ప్రతీఒక్కరూ కూడా దయ, కరుణ కలిగి ఉండాలి



జీవితంలో మనం పెంపొందించుకోవాల్సిన ముఖ్యమైన లక్షణాలలో కరుణ ఒకటి. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ దుఃఖాలు ప్రత్యామ్నాయంగా ఉంటాయి కాబట్టి, బాధపడేవారికి సహాయం చేయడం మనకు చాలా ముఖ్యం. ఇతరులకు సహాయం చేయాలనే కోరిక ఉండాలంటే, మనలో కరుణ ఉండాలి.

భగవంతుని కరుణ అపరిమితమైనది కాబట్టి, ఆయనను కరుణా సముద్రం అని వర్ణించారు. ఈ కరుణే ఆయనను ప్రపంచ మోక్షానికి అనేక అవతారాలు తీసుకోవడానికి ప్రేరేపిస్తుంది.

కరుణతో ఒకరు మరొకరికి సహాయం చేసినప్పుడు, ప్రతిఫలంగా ఏమీ ఆశించకూడదు. అప్పుడే అతన్ని మంచి వ్యక్తి అని పిలుస్తారు.

ఆది శంకర భగవత్పాదులు కరుణతోనే గురువు తన శిష్యుడికి బోధిస్తాడని చెప్పారు. శిష్యుడు భక్తితో గురువును సంప్రదించాలి. ఎందుకంటే గురువు కరుణా సముద్రం. మరియు బ్రహ్మజ్ఞానులలో ఉత్తమమైనది.

ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో దయ అనే గుణాన్ని పెంపొందించుకోవాలి మరియు ఆచరించాలి. ఇతరులకు చేసే చిన్న సహాయం కూడా దాని ఫలితాన్ని కలిగి ఉంటుంది. ఇతరుల గురించి మంచి మాటలు మాట్లాడటం మంచి పని. ఆదిశంకరుడు తనకు హాని కలిగించడానికి వచ్చిన కాపాలికుడి పట్ల దయ చూపించాడు. ఇది అత్యున్నతమైన దయ.


చిన్నప్పటి నుండే పిల్లలలో దయను పెంపొందించాలి. పాఠశాలలో చదువుతున్నప్పుడు కూడా, విద్యార్థులు తమ తోటి విద్యార్థులకు ఏదైనా చిన్న సహాయం అందించడం నేర్పించాలి. ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతుండటం మనం చూస్తే, వారిని శాంతింపజేసి, పోరాటాన్ని ఆపడానికి ప్రయత్నించడం మన కర్తవ్యం. దయతో నిండిన వ్యక్తులు మాత్రమే ఈ ప్రయత్నం చేయగలరు.

మంచి స్థితిలో ఉన్న వ్యక్తి తన వద్దకు అర్హతతో వచ్చే వారికి సహేతుకమైన సహాయం అందించాలి. మన జీవితంలో ఇతరులకు సహాయం చేయడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. మనం వాటిని కోల్పోతే, మనం చింతించవచ్చు. అది కూడా అజ్ఞానమే.

కాబట్టి, ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయం చేయడానికి మరియు దేవుని కృపను పొందడానికి తమ వంతు కృషి చేయాలి.

--- జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారు

# ఛత్రపతి శివాజీ ప్రాణాలు కాపాడిన వీరుడు!!



భారత దేశంలో ప్రతి ఒక్క పౌరుడు ఇష్టపడే మనసున్న మహారాజు, పులి గోళ్లతో "అఫ్జల్ ఖాన్" గుండెను చీల్చిన మహారాష్ట్ర పెద్దపులి, ఆడవాళ్లను గౌరవించడం నేర్పిన అసలైన మగాడు. హిందూ ధర్మాన్ని కాపాడటానికి ఆఖరి శ్వాస వరకు పోరాడిన హైందవ ధర్మోద్ధారకుడు, కేవలం రాజ్యాలను పాలించే రాజుగా మిగిలి పోకుండా ప్రజలను ప్రేమించి "ఛత్రపతి" గా ఎదిగిన జిజియా బాయి ముద్దు బిడ్డ, నేను ఎవరి గురించి చెబుతున్నానో మీకు ఈ పాటికే అర్థం అయ్యి ఉంటుంది. అతడే మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహరాజ్.

కానీ ఈ వ్యాసం ఛత్రపతి శివాజీ మహరాజ్ గురించి కాదు ఆ శివాజీ మహరాజ్ ప్రాణాలనే కాపాడిన ఒక యోదుడి గురించి.

రాజు కోసం, దేశం కోసం, ధర్మ కోసం చావును సైతం దిక్కరించి, దేహమంత రక్తంతో తడిసి ముద్ద అయినా కూడా, రాజు ఛత్రపతి శివాజీ సురక్షితుడు అయ్యాడు అన్న వార్త తెలిశాకే ప్రాణాలను వదులతానని మొండి పట్టుతో యుద్ధం చేసిన వీరుడి గురించి. మన చరిత్ర మనం తెలుసుకోవడం ఈ గడ్డపై పుట్టిన మన అందరి బాధ్యత.

అది 1660 వ సంవత్సరం. బీజాపూర్ రాజ్యాన్ని వందల ఏళ్లుగా పాలిస్తున్న "ఆదిల్షాయులు" ఎన్నో సార్లు శివాజీ మీదకు యుద్ధానికి వెళ్లి చావు దెబ్బ తిని ఓడిపోయేవారు. అందుకే ఈ సారి ఆధీల్షాయులు "మొగల్ చక్రవర్తి ఔరంగజేబు" సహాయం తీసుకొని మరీ పన్హాలా కోటలో 600 మంది సైన్యంతో ఉన్న శివాజీని, శివాజీ కుడి భుజం, సర్వ సైన్యాధిపతి అయిన "బాజీ ప్రభు ధేస్పాండే" ని 10000 వేల సైన్యం తో కోటని చుట్టుముట్టి బంధీలను చేశారు. సరైన సమయం చూసి ఛత్రపతిని చంపేయాలని "ఆధీల్షాయులు" ఎదురు చూస్తున్నారు.

కేవలం 600 మంది సైన్యం. ఆ 600 మంది సైన్యం, 10000 మందితో పోరాడి యుద్ధం గెలవడం అసాధ్యం అని శివాజీకి తెలుసు కాబట్టి అక్కడి నుండి తప్పించుకోవడం ఒక్కటే శివాజీకి ఉన్న మార్గం. కానీ 10000 మంది నుండి తప్పించుకోవడం కూడా అంత సులువైన పని కాదు, పన్హాలా కోటలో ఉన్న ధాన్య శాలలో ఉన్న మొత్తం ధాన్యం ఖాళీ ఐతే ఆధీల్షాయులలోని సైన్యం కొంతభాగం ఆహారం సేకరించుటకు వెళ్తుంది. అప్పుడు తప్పించుకోవడం సులువుగా ఉంటుందని శివాజీ ఆదేశించారు. కొన్ని నెలలు గడిచాయి పన్హాల కోటలోని ఆహారం దాన్యగారం లోని ధాన్యం అన్నీ ఖాళీ అయిపోయాయి.

ఇప్పుడు 10000 మందికి ఆహారం కావాలి కాబట్టి ఆధీల్షాయుల సైన్యం లోని కొంతభాగం ఆహారం కోసం మరో దేశానికి బయలుదేరారు. ఛత్రపతి శివాజీ తప్పించుకొనే సమయం స్పన్నమైనది. పన్హలా కోట నుండి "రంగీ నారాయణ్" అనే మరాఠా నాయకుడు పాలిస్తున్న "విశాల్ఘట్ కోటకు" వెళ్ళాలి అని శివాజీ నిర్ణయించుకున్నాడు.

13 జులై 1660 వర్షాకాలం. అవాస్యకి దగ్గరలో వెన్నెల కాంతి బాగా తక్కువ ఉన్న ఒక రాత్రి, ఛత్రపతి శివాజీ బాజీ ప్రభువులతో పాటు 600 మంది సైనికులు "విశాల్ఘట్" కు అడవి మార్గం గుండా ప్రయాణించటానికి సిద్ధంగా ఉన్నారు.

సైన్యం లో శివాజీ మహారాజు పోలికలతో ఉండే "శివకాశీ" అనే ఒక సైనికుడిని శివాజీ ధరించే దుస్తులు నగలు తొడిగి అచ్చుగుద్దినటట్లుగా శివాజీ మహారాజు లాగా తయారు చేసి ఆధీల్షాయి సైన్యానికి కనపడే విధంగా 10 మంది సైనికులతో పంపించారు.

ఛత్రపతి శివాజీ వేషంలో ఉన్న శివకాశీ ని చూసి శివాజీ నే తప్పించుకుంటున్నాడు అనుకుని ఆదిల్షాయిల సైన్యాధిపతి తన సైన్యం అంతటినీ పిలిపించాడు. ఇదే అదును చూసి ఆదిల్షాయిల సైన్యం మొత్తం శివకాశీ దగ్గరకు వెళ్లినప్పుడు, విశాల్ఘట్ వైపుకు అడవి మార్గం గుండా అతి వేగంగా బయలు దేరారు శివాజీ అతని సైనికులు.

వర్షాల తాకిడికి అడవిగుండా ముళ్లకంపలు చెత్తా చెదారం కొట్టుకొచ్చాయి, నడిచే మార్గం అంతా బురద ముళ్ల పొదలతో భయంకరంగా ఉంది. కానీ అక్కడ ఉన్న 600 మందికీ ఒక్కటే లక్ష్యం ఛత్రపతి శివాజీని విశాల్ఘట్ కు చేర్చటం. ఆ 600 కి ఉన్న ధైర్యం కూడా ఒక్కడే అతడే బాజీ ప్రభు దేశ్పాండే.

బాజీ ఉన్నంత వరకు తమను ఎవరూ ఏమి చేయలేరు అనే నమ్మకం తో అడుగులు ముందుకు వేస్తున్నారు. ఆదిల్షాయిల సైన్యాధిపతి

పట్టుకున్నది శివాజీ మహారాజు ను కాదని మారువేషంలో ఉన్న శివకాశీ అని తెలుసుకోటానికి ఎక్కువ సమయం పట్టలేదు.

శివకాశీ ని అక్కడికక్కడే నరికి చంపి 8000 మంది సైన్యాన్ని శివాజీ వెనుక తరముకుంటు వెళ్లి శివాజీ ని బంధించి తీసుకురమ్మని ఆదేశించాడు. తెల్లవారే సమయానికి "గోడ్కింగ్" అనే ఇరుకైన పర్వత ప్రాంతంలో విశ్రాంతి తీసుకొంటున్న శివాజీ సైన్యం, ఆదిల్షాయుల సైన్యం సమీపిస్తుందని తెలుసుకొని ఆశ్చర్యపోతారు. ఆదిల్షాయిల సైన్యానికి చిక్కకుండా వేగంగా విశాల్ఘట్ కి చేరటం అసాధ్యం.

ఎందుకంటే ఆ సమయం లో ఛత్రపతి శివాజీ సైన్యం వద్ద ఒక్క గుఱ్ఱం కూడా లేదు, కానీ సగం ఆదిల్షాయిల సైన్యం వద్ద గుఱ్ఱాలు ఉన్నాయి. అక్కడే యుద్ధం చేసి ఆదిల్షాయిల సైన్యాన్ని ఓడించటం జరగని పని.

8000 మంది సైన్యం తో 600 మంది ఎంత భయంకరంగా పోరాడినా గెలవడం మాత్రం అసాధ్యం. ఇప్పుడు ఛత్రపతి సైన్యానికి ఉన్న ఒకే ఒక్క దారిని బాజీ ప్రభువు రాజుతో వివరించాడు.

గోడ్కింగ్ చాలా ఇరుకైన ప్రాంతం ఈ దారిగుండా సైన్యం ఒకేసారి ఎక్కువ మందితో దాటలేదు. సైన్యం లో సగం మందిని అంటే సరిగ్గా 300 మందితో నేను గోడ్కింగ్ కు అడ్డుగా నిలబడి ఆదిల్షాయిల సైన్యం తో పోరాడుతాను. ఒకేసారి ఎక్కువ మంది సైనికులు ఈ దారిగుండా రాలేరు కాబట్టి తక్కువలో తక్కువ రెండు మూడు గంటల వరకు నేను ఆదిల్షాయిలను ఆపగలను. ఈ సమయం లో మిగిలిన 300 మంది సైన్యం తమ ప్రాణాలతో ఛత్రపతిని కాపాడుకుంటూ "విశాల్ఘట్" కు చేర్చండి. శివాజీ మహారాజు సురక్షితంగా విశాల్ఘట్ కు చేరుకోగానే అక్కడ ఉన్న ఫిరంగులను 5 సార్లు పేల్చండి. ఫిరంగులు శబ్దం మహారాజు సురక్షితంగా విశాల్ఘట్ కు చేరారు అని నాకు సంకేతం అని పథకాన్ని వివరించాడు. మరో దారి లేక అందరూ ఈ పథకాన్నే ఒప్పుకున్నారు.

300 మంది సైన్యం తో శివాజీ మహారాజు విశాల్ఘట్ కు బయలు దేరాడు. మిగిలిన 300 మంది సైన్యం తో బాజీ ప్రభువు యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డాడు. ఆదిల్షాయిల సైన్యం గోడ్కింగ్ కు చేరుకుంది. యుద్ధం మొదలు అయ్యింది. అరటి చెట్లను నరికినంత సులువుగా ఆదిల్షాయిలను నరికేస్తున్నారు బాజీప్రభు అతని సైన్యం. ఇరుకైన కొండ ప్రాంతం అవ్వటం తో శివాజీ మహారాజుకు తప్పించుకోడానికి ఎక్కువ సమయం దొరికినా అవతలి వైపు ఉన్నది 8000 మంది సైన్యం 300 మంది బాజీ ప్రభు సైన్యం ఒక్క నిమిషం కూడా కత్తి తిప్పటం ఆపటం లేదు. సమయం గడిచేకొద్దీ బాజీ ప్రభు సైన్యం తరిగిపోతుంది , కానీ బాజీ ప్రభువు వైపు ఒక్క సైనికుడు చనిపోతే ఆదిల్షాయిల వైపు 20 నుండి 30 మంది చనిపోతున్నారు . సుమారు 4 గంటలు గడిచే సరికి 8000 మంది ఆదిల్షాయిల సైన్యం లో 5000 మంది మరణించారు. కానీ బాజీ ప్రభు సైన్యం లో దాదాపు అందరు మరణించారు.

బాజీ ప్రభు తో పాటు అతికొద్ది మంది మాత్రమే మిగిలారు. కేవలం 300 మంది సైన్యం తో 5000 మందిని చంపటం చరిత్రలో అదే మొట్టమొదటి సారి ఒంట్లో ఉన్న ప్రతి అవయవం మీద కత్తి వేట్లతో దేహం అంతా గాయాలతో%లల%రక్తంతో%లల% తడిసి ముద్ద అయ్యి ఎర్రగా మండుతున్న అగ్నిగోళంలా ఉన్న బాజీ ప్రభువును చూసి "మనీషా %--% రాక్షసుడా" అని భయపడ్డారు ఆదిల్షాయిలు. నిజానికి బాజీ ప్రభువు కి తగిలిన గాయాలు కత్తి పోట్లలో పావు వంతు తగిలినా ఒక మనిషి మరణిస్తాడు , కానీ అగ్ని పర్వతం నుండి లావా ఉబికినట్టు బాజీ ప్రభువుల అవయువాల నుండి రక్తం ప్రవహిస్తున్నా. అతని చేయి మాత్రం ఇంకా కత్తి తిప్పుతూనే ఉంది.

తనరాజు "ఛత్రపతి శివాజీ మహరాజ్" విశాల్ఘట్ కు చేరే వరకు తన ప్రాణాలు వదిలే సమస్యే లేదని ఒక చేతితో మృత్యువుని ఆపుతూ. మరో చేతితో యుద్ధం చేస్తున్నాడు బాజీ ప్రభు దేశ్పాండే. చావుని పూర్తిగా ధిక్కరించి ఊపిరికి ఊపిరి పోగు చేసుకొని యుద్ధం చేస్తూనే ఉన్న బాజీ ప్రభువు చెవులు యుద్ధం మొదలైన నాలుగు గంటల తరువాత ఫిరంగి పేలుడు శబ్దాలు విన్నాయి.

"నా రాజుని కాపాడుకున్నాను అనే చిరునవ్వు పెదవుల పైకి వచ్చేలోపు దేశ ప్రజలను రక్షించాను అనే గర్వం కళ్ళలోకి చేరే లోపు అతని చెయ్యి కత్తిని వదిలేసింది".

కాళ్లు నేలకు ఒరిగాయి. కళ్ళు ఆకాశాన్ని చూస్తూ. ప్రాణం శరీరాన్ని వదిలింది. చరిత్ర "కనీ వినీ" ఎరగని యుద్ధం చేసి, కేవలం 300 మందితో 8000 మందిని అడ్డుకొని మృత్యువునే వాయిదా వేసిన బాజీ ప్రభువు త్యాగానికి ఛత్రపతి శివాజీ మహారాజు కన్నీటి నివాళి అర్పించి "గోడ్కింగ్ ప్రదేశాన్ని పావన్ కింగ్" అంటే పవిత్రమైన ప్రదేశం అని ప్రకటించాడు. ఆ తరువాత బాజీ ప్రభువుల పిల్లలను తన సొంత పిల్లలుగా పెంచి పోషించాడు ఛత్రపతి శివాజీ!

ఈ రోజు ఈ దేశం లో హిందుత్వం ఇంకా బతికి ఉంది అంటే కారణం ఇటువంటి మహా వీరులు మనకోసం తమ ప్రాణాలను అర్పించటమే. ❑





# ఆదివారం చేయవలసిన పనులు - చేయకూడని పనులు

ఆదివారం రోజు కొన్ని పనులు చేస్తే అదృష్టం బాగా కలిసొస్తుంది. కొన్ని పనులు చేస్తే దురదృష్టం మిమ్మల్ని వెంటాడుతుంది. ఎవరైనా సరే ఆఫీసుకు సంబంధించిన వ్యవహారాలు అంటే మీ ఆఫీసర్లను కలుసుకోవటం ప్రత్యేకమైన ఆఫీస్ లేదా వ్యాపారానికి సంబంధించిన ముఖ్యమైన అగ్రిమెంట్లు చేసుకోవటం ఇలాంటివన్నీ ఆదివారం చేస్తే అదృష్టం బాగా కలిసొస్తుంది. ఎవరైనా సరే ఆవులు గేదెలు ఆదివారం పూట కొనడం చాలా మంచిది. వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు కొనడం

అలాగే వరి పంట వేయాలన్న గోధుమ పంట వేయాలన్నా ఆదివారం జ్యోతిషపరంగా కలిసొస్తుంది. గురువుల దగ్గర మంత్రం తీసుకొనే వారికి ఆదివారం తీసుకుంటే త్వరగా మంత్రసిద్ధి ఏర్పడుతుంది. సంగీతం నేర్చుకోవాలని భావించే వారు ఎవరైనా సరే ఆదివారం రోజు సంగీతం నేర్చుకోవడం ప్రారంభిస్తే సంగీత రంగంలో సక్సెస్ అవుతారు. కోర్టు వ్యవహారాలు ప్రారంభం చేయాలంటే ఆదివారం చేస్తే చాలా మంచిది. దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండి మందులు వాడాలి అనుకుంటున్నవారు ఆదివారం ప్రారంభిస్తే ఆరోగ్య సమస్యలు తొందర్లోనే తగ్గిపోతాయి. ఆదివారం సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించవచ్చు. ఆదివారం గ్యాస్ స్టవ్ కొనుక్కోవచ్చు. ఆదివారం కొన్ని పనులు చేయకూడదు ఆదివారం అప్పు ఇస్తే తిరిగి రావడానికి సమయం ఎక్కువ పడుతుంది. ఆదివారం తలంటు స్నానం చేయకూడదు. ఆదివారం తలంటు స్నానం చేస్తే అనారోగ్యం కలుగుతుందని జ్యోతిష్య శాస్త్ర పరంగా చెప్పడం జరిగింది. అలాగే ఆదివారం ఉదయం ఆరు నుంచి ఏడు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒకటి నుంచి రెండు గంటల మధ్య ప్రాంతంలో రాత్రి 8 గంటల నుంచి 9 గంటల మధ్య ప్రాంతాల్లో రవి హోర ఉంటుంది సొసైటీలో ముఖ్యమైన వ్యక్తులను కలిసే అవసరం ఉంటే కలవండి. అలాగే ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు కూడా ఆదివారం చేస్తే అద్భుత ఫలితాలు లభిస్తాయి. ❑



# పెళ్లయిన వెంటనే సత్యనారాయణ స్వామీ వ్రతం ఎందుకు చేయమంటారు?

సత్యనారాయణస్వామి వ్రతాన్ని ప్రతి ఇంట్లో విధిగా ఆచరించడం ఆనవాయితీ ! పెళ్లయిన మరుసటి రోజు ఇంటికి వచ్చిన కొత్త దంపతులతో ఖచ్చితంగా ఈ వ్రతాన్ని ఆచరింపజేస్తారు . గృహప్రవేశానికి, ఇతరములైన శుభకార్యాలు చేసుకున్నా, ప్రత్యేకించి కార్తీకమాసంలోనూ ఖచ్చితంగా సత్యనారాయణ వ్రతాన్ని విధిగా ఆచరించడం మనవారికి అలవాటు. కానీ ఎందుకు ఆ సత్యనారాయణస్వామీ వ్రతాన్ని విధిగా చేసుకోవాలని చెబుతారని విషయాన్ని మనం పెద్దగా ఎప్పుడూ ఆలోచించి ఉండకపోవచ్చు ! ఒక సంప్రదాయంగా ఈ వ్రతాన్ని కొనసాగించే వారు ఎందరో ఉంటారు.

సత్యనారాయణ స్వామీ వ్రతం అనే వరం మనకి జనారదుని పుణ్యమాజ అని సంప్రాప్తినిచ్చిందే. ఆయన్ని కలహాజ భోజనుడని తిట్టుకుంటాం కానీ లోకోపకారం కోసం ఆయన అందించినన్ని వరాలు, వ్రతాలు మారె మహర్షీ అందించలేదేమో ! అందుకే ఆయన దేవర్షి స్థానాన్ని పొందారు. ఇంతకీ ఈ వ్రతాన్ని జాతి, మత, కుల విబేధాలు లేకుండా ఎవరైనా ఆచరించుకోవచ్చు. స్త్రీలుకూడా నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. ఈ వ్రతాన్ని ఆచరించడం వలన కలియుగంలో దుఃఖాలు తొలగిపోయి, సకల సంపదలూ సంప్రాప్తిస్తాయని, సంతానం కలుగుతుందని, అదీ అదీ అననేల, సకల సౌభాగ్యాలూ వృద్ధి చెందుతాయని స్వయంగా నారాయణుడే నారదునికి చేప్పారు .

పైగా సత్యనారాయణుడు అంటే, కేవలం విష్ణు స్వరూపము కాదు ! ఆయన త్రిమూర్త్యాత్మకుడైన కలియుగ దైవం . అందుకే శ్రీ సత్యనారాయణ స్వామివారిని

**“ మూలతో బ్రహ్మరూపాయ**
**మధ్యతశ్చ మహేశ్వరం**
**అధతో విష్ణురూపాయ**
**త్రైక్య రూపాయతేనమః** “ అని స్తుతిస్తారు.

ఇక, వివాహం అయిన వెంటనే ఈ వ్రతాన్ని ఆచరింపజేయడానికి కారణం కూడా ఇందులోనే దాగి ఉంది . కొత్త జీవితాన్ని ప్రారంభించబోయే నవ దంపతులు సకల సౌభాగ్యాలతో వర్ధిల్లాలని అందుకు , ఆ సత్యనారాయణుని ఆసీస్సులు అవసరమని వారితో తొలుత సత్యనారాయణ వ్రతాన్ని ఆచరింపజేస్తారు . ఇంకా గర్భాదానానికి ముందర ఈ వ్రతాన్ని దంపతులు ఆచరించడం వలన వారు సత్సంతానాన్ని పొందుతారని విశ్వశిస్తారు. అందువలనే , నూతన దంపతుల చేత సత్యనారాయణ వ్రతాన్ని ఆచరింపజేస్తారు

సాధారణంగా ఎప్పుడైనా కూడా ఈ సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించుకోవాలి అనుకుంటే, ఒక మంచి రోజు చూసి, బంధు మిత్రులను పిలిచి, పంచభక్ష్య పరమాన్నాలు చేసి, పూలు, ఫలము భగవంతునికి సమర్పించి , భక్తి శ్రద్ధలతో పూజ జరిపి బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలములిచ్చి, బంధు మిత్రులకు, విందు భోజనాలు పెట్టి, ప్రసాదము తాను తిని యితరులకు పెట్టాలి. ఇట్లా చేస్తే వాళ్ళు కోరిన కోరికలు ఈడేరి సంతోషముగా ఉంటారు.

ఈ వ్రతము విశేషముగా కలియుగములో విశేష పలితాన్నిస్తుంది. ❑



# ఆంధ్రకేసరి - టంగుటూరి ప్రకాశం పంతులు

ఒక వీధిబడిలో మాష్టారు తెలుగుపాఠం చెబుతున్నారు! ఒక పిల్లాడు లేచి సార్ ఈడికి నిన్న ఇచ్చిన పుస్తకం అమ్మేశాడు అని ఒక అబ్బాయిని చూపుతూ చెప్పేడు.దానికి మాష్టర్ ఏమిరా వెధవా నిజమేనా అని అడిగితే నిజమే అని చెప్పేడు ఆకుర్రాడు. ఏమిరా వెధవా ! నీకెలా అని గద్దించగా నేను మొత్తం చదవేశానండీ ..!! ఆ పుస్తకాన్ని అన్నాడు ఆ పిల్లాడు.

దానికి కోపంతో మాష్టర్ బడుద్దాయ్ నాకే అబద్ధం చెబుతావా అయితే చెప్పు 8 వ పేజీలో ఏముంది అనగా ,మొత్తం గడగడా చెప్పేశాడాబ్బాయి. ఆశ్చర్యపోయిన మాష్టర్ వివిధ పేజీలలో ఏముందో అడిగేడు. అన్నింటిని చెప్పేడు ఆ కుర్రాడు. చివరకి 48 వ పేజీలో ఏముందో చెప్పమనగా, అసలు ఆ పుస్తకంలో 48 వ పేజీ లేదు కదసార్ అన్నాడు. దానితో మాష్టర్ ఆనందభాష్పాలు రాలుస్తూ నాయనా నువ్వు చాలా గొప్పవాడివవుతావురా అని దగ్గరకు తీసుకొని దీవించాడు. ఆ దీవెనలు ఊరకే పోలేదు. ఆ అబ్బాయి గొప్ప బారిష్టర్ అయినాడు. తెలుగు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కూడా అయినాడు అతని పేరే తెలుగువారు గర్వంగా ఆంధ్రకేసరి అని పిలుచుకొనే టంగుటూరి ప్రకాశం పంతులు గారు.

ఒక సారి ఆయన గొప్పతనం గురించి గుర్తుచేసుకొందాం.

1872 ఆగష్టు 23 న ఒక నిరుపేద కుటుంబంలో జన్మించారు పంతులుగారు. వాళ్ళమ్మగారు పూటకూళ్ళు పెట్టేవారు. ఆరోజులలో అలా పెట్టేవారిని చిన్నతనంగా చూసేవారు. పంతులు గారు కూడా ధనవంతుల ఇళ్ళలో వారాలబ్బాయిగా వుండి చదువుకొనేవారు.అయితే నాటకాల పిచ్చెక్కువ. మెట్రిక్ తప్పాడు. అయితే హనుమంతురావ్ నాయుడు అనే మాష్టర్ సహాయంతో మద్రాస్ లో ఎఫ్. సి పాసై లా చదివి లాయర్ గా ప్రాక్టీస్ చేసేవారు.

మంచి తెలివిగలవారైనందున వాగ్దాటి పటిమ కలవాడైనందున అనతికాలంలో గొప్పలాయర్ అయినాడు. అయినా బారిష్టర్ లేనందున ద్వితీయ శ్రేణి లాయర్ గానే వుండవలసివచ్చింది. అందుకు 1904 లో ఇంగ్లండ్ వెళ్ళి బారిష్టర్ చదివేడు. అప్పుడే అక్కడ దాదాభాయ్ నౌరోజీతో పరిచయం అయింది.బారిష్టర్ అయిపోయిన తరువాత మద్రాస్ హైకోర్ట్ లో ప్రాక్టీస్ మొదలుపెట్టేరు.

అప్పటి వరకు ఆంగ్లేయులు, తమిళయన్స్ మాత్రమే హైకోర్టు లాయర్స్ గా పేరుపొందేరు. తెలుగువారు మొదటి హైకోర్టు లాయర్ అవటంతో చాలా కేసులొచ్చాయి. తన వాగ్దాటితో అనతికాలంలో గొప్ప బారిష్టర్ పేరు సంపాదించాడు. ఆరోజుల్లోనో లక్షలు సంపాదించాడు. ఒకరోజు వాళ్ళావిడ డబ్బులు దాచడానికి ఖాళీ ఎక్కడాలేదండీ అన్నదంటే పరిస్థితి అర్థంచేసుకోండి. క్రమంగా స్వాతంత్రఉద్యమం వైపు ఆకర్శితులై హోంరూల్ లో ఉద్యమంలో చేరాడు. స్వరాజ్య అనే పత్రికను తెలుగు,తమిళ భాషలలో నడిపేరు.

1921 సహాయనిరాకరణోద్యమ సందర్భంగా తన యావదాస్థితిని ప్రజలకు అంకితం చేసి ,బారిష్టర్ గా రాజనామా చేసి భారతీయ కాంగ్రెస్ లో సభ్యునిగా చేరినారు.

1929 లో సైమన్ కమీషన్ రాక సందర్భంగా మద్రాస్ లో నిరసనలు తెలుపుతున్న ప్రజలపై ఆంగ్లేయులు కాల్పులు జరపగా పార్థసారథి అనే యువకుడు మరణించాడు.అతనిని చూడకుండా నిషేదాలు విధించగా ప్రకాశంగారు ధైర్యంగా వెళ్ళారు. కాలుస్తామని తుపాకులు ఎక్కుపెట్టగా కాల్చండిరా అంటూ గుండెలు చూపారు. అతని ధైర్యానికి మెచ్చిన ప్రజలు "ఆంధ్రకేసరి" అని బిరుదిచ్చారు.

1937 లో కాంగ్రెస్ మద్రాస్ రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలుసుకొనింది. అందరూ ప్రకాశం గారు ముఖ్యమంత్రి అనుకొంటుండగా గాంధీ, నెహ్రూల ప్రీతిపాత్రుడైన రాజాజీ ముఖ్యమంత్రి అయినాడు. ప్రకాశం గారికి రెవెన్యూమంత్రి అయినారు. అయితే రెండో ప్రపంచయుద్ధంలో భారత్ పాల్గొనడానికి నిరసనగా ఆ పదవికి రాజీనామా చేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు.1946 లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినారు.

కాని రాజాజీ, కామరాజ్ లాంటి నాయకుల కుయుక్తులను భరించలేక 11 నెలల తరువాత పదవికి రాజీనామా చేశారు. ప్రజా పార్టీ ని పెట్టేరు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రి అయినారు. కాని కమ్యూనిష్టులు మద్దతు ఉపసంహరించుకోవడంతో 1954 నవంబర్ 24 న రాజీనామా చేసి రాజకీయాల నుండి విరమించుకొన్నాడు.

ప్రకాశంగారు చాలా ధైర్యస్తుడు. ముక్కుసూటి మనిషి ఎవరినైనా లెక్కచేసేవాడుకాదు.

అందులో కొన్ని....

ఒక ఉద్యమంలో ప్రజల నుండి విరాళాలు సేకరించారు. కాని ప్రకాశం పంతులంటే పడనివారు గాంధీకి మాయమాటలు చెప్పి లెక్కలడగ మన్నారు. గాంధీ లెక్కల అడగగా " మహాత్మా లక్షలు చూశాను, అలాంటిది వేయిరూపాయలు నాకు లెక్కా?? అయినా ప్రతి పైసాకు లెక్కొంది చూపుతా!! మీరు మేకపాలు తాగేందుకు టాటా ల ఖర్చెంతో చెబుతారా అని ఘాటుగా బదులిచ్చారు.

1952 లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమకాలంలో నెహ్రూ మీద రూపాయి నోటు విసిరేస్తూ దానిలో తెలుగులో రూపాయి అని వుంది.మరి రాష్ట్రం ఎందుకివ్వకూడదో చెప్పమన్నాడు.

1948 లో నెహ్రూ హెచ్చిరికలు బేఖాతర్ చేస్తూ హైదరాబాద్ నిజాం దగ్గరకెళ్ళి రజాకార్ల ఉద్యమ నాయకుడైన ఖాజింరజ్వీని ఉద్దేశించి నువ్వు నీ అదృష్టాన్ని దూరం చెసుకొంటున్నావ్ అని హెచ్చరించారు. అతని ధైర్యానికి అబ్బుర పడిన రజాకార్ల సైన్యం అసంకల్పితంగా అతనికి సల్యూట్ చేశారట. వారి సల్యూట్ అందుకొన్న తెలుగువాడు  నత డొక్కడే.

పేదరికం అనుభవిస్తూ పెరిగేడు లక్షలు సంపాదించాడు చివరికి పేదరికంలోనే చనిపోయిన మహామనిషి మన ఆంధ్రకేసరి. ఆ మహానుభావుడికి అశ్రువులనిండిన కళ్ళతో నివాళులు అర్పిస్తూ....

**జోహార్. ఆంధ్రకేసరి...**

# త్రిపురసుందరి ఉపసాకులు చందోలు శాస్త్రి

ఒక 50 ఏళ్ళ క్రితం మాట. తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి గారనే గొప్ప బాలాత్రిపురసుందరి ఉపసాకులు గుంటూర్ జిల్లా చందోలులో నివసించేవారు. వారినే చందోలు శాస్త్రి గారని కూడా అనేవారు. తరుచూ వీరు గురించి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారు చెప్తూ ఉంటారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు వారి గురించి ఒక ప్రవచనంలో చెప్పిన మాట.

శాస్త్రి గారు ఒక కాలంలో తీవ్రమైన పేదరికం అనుభవించారు. తినడానికి తిండి లేని పరిస్థితి. అటువంటి పరిస్థితిలో కూడా వారు అమ్మవారి ఉపాసనను విడిచిపెట్టలేదు. రోజుకు 27 సార్లు లలితా సహస్రనామం పారాయణ చేసి, అమ్మవారికి నివేదన చేయడానికి ఏమీ లేకపోతే, చెంచాతో మంచినీళ్ళు నివేదన చేసేవారు. ఎంతటి తీవ్రమైన వ్యతిరేక పరిస్థితులు ఎదురుకొన్నా, అమ్మవారి యందు నిశ్చలమైన, అచంచలమైన భక్తిని వీడలేదు.

ఇది చూసి అమ్మ పొంగిపోయింది. ఒకానొకనాడు బాలా అమ్మవారు శాస్త్రిగారికి ప్రత్యక్షమై "శాస్త్రి! ఇంకా చాలు. ఎన్నాళ్ళు అనువభిస్తావు. ఇక అయిపోయిందిలే" అన్నది. అక్కడితో వారి పేదరికం అంతరించింది. అటు తర్వాత వారు మరణించేవరకు వారి ఇంట అనేకమందికి అన్నదానం చేశారు.



బాలా త్రిపురసుందరి దేవి పై వారికి ఎంత భక్తి అంటే, ఆయన పనిలో ఉన్నప్పుడు, వారి ఇంటికి ఎవరైనా వచ్చి, శాస్త్రీగారిని పిలిస్తే, బాలా అమ్మవారు చిన్న పిల్ల రూపంలో ఇంట్లోంచి బయటకు వచ్చి, 'మా నాన్న గారు పనిలో ఉన్నారండి. కాసేపు ఆగండి' అని చెప్పేది. ఆఖరికి వారి మరణం తర్వాత దేహం చితిలో కాలుతున్న సమయంలో, ఆ చితి మంటలపై అమ్మవారు కనిపించింది. ఇది ఫోటో తీసి పత్రికలలో కూడా వచ్చింది.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అనే మాటకు ఇదే ప్రత్యక్ష ఉదాహరణ. అమ్మవారిని ప్రేమతో, నిశ్చల భక్తితో, అచంచల విశ్వాసంతో పూజిస్తే, పొందలేనిదంటూ ఏం ఉంటుంది? ❑


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*





# పరమార్థ కథలు



## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

# కనువిప్పు

దాదాపు అరువది సంవత్సరముల క్రిందటిమాట. గుజరాతు ప్రాంతమందలి ఒక విద్యార్థి విశ్వవిద్యాలయమందు పట్టభద్రుడై ఉన్నత విద్యకొఱకై పశ్చిమదేశమునకు వెళ్ళెను. అతడు చాలా చురుకైన విద్యార్థి ప్రతితరగతి యందును తక్కిన విద్యార్థు లందఱికంటెను ఎక్కువ మార్కులు సంపాదించుచుండెను. అందువలన గవర్నమెంటువారు ఉచితవేతనమును (Scholarship) ఇచ్చి ఐ.సి.ఎస్. (I.C.S.) అను పెద్ద పరీక్ష చదువుటకై లండన్ పట్టణమునకు అతనిని పంపిరి, అతనిపేరు త్రివేది. గుజరాతుప్రాంతంలోని వారి పేర్లు ద్వివేది, త్రివేది, చతుర్వేది అని ఈ ప్రకారంగా తరచు ఉండుచుండును. ఆ త్రివేదీ అను విద్యార్థి ఉన్నతపరీక్షకొరకై చక్కగ చదివి, పరీక్షవ్రాసి, ఆ లండన్ పట్టణమందు, తత్పరిసరమందు చూడవలసిన విశేషస్థలము లన్నిటిని చూచి తిరిగి భారతదేశమునకు పయన మగుటకు సంసిద్ధుడగుచుండెను.

ఆకాలమున లండన్ పట్టణమున ఒక మహావిద్వాంసుడు ప్రజ్ఞాశాలి అద్భుత శీలసంపన్నుడు తపస్వి అయిన ఒకమహానుభావుడు నివసించుచుండెను. అతనిపేరు మాక్సుముల్లరు (Maxmuller). అతని పవిత్రతనుజూచి మోక్షముల్లరు అని కూడ కొందరు పిలుచుచుందును. వివేకానందస్వామి ఆతని గుణగణములను విని. నేరులో వారిని సందర్శించి, వారి ఔన్నత్యమునకు, తపశ్శక్తికి అచ్చెరువొందియుండెను. మాక్సుముల్లరు వేదముల నన్నిటిని ఇంగ్రీషుభాషలోనికి అనువదించెను. పైన తెలిపిన త్రివేది అను విద్యార్థి తన విద్యాభ్యాసంగమును పూర్తిచేసికొని భారత దేశమునకు తిరిగివచ్చు తరుణమున మిత్రుడొకడు మాక్సుముల్లరుయొక్క ఖ్యాతిని గూర్చి అతనికి వివరించి చెప్పి, వారిని తప్పక దర్శించి వెళ్లుట శ్రేయస్కరమని సలహా నొసంగెను.

అట్లే ఆ విద్యార్థి మాక్సుముల్లరుగారిని దర్శించుటకై వారి గృహమున కేగెను. అట్లు వెడలి ఇల్లు చేరగనే తనపేరు ఒక చీటిపై వ్రాసి దర్శనమునకు అనుమతించవలసినదిగ కోరి దానిని గేటువద్దనున్న సేవకునకు ఇచ్చి లోనికి పంపెను. అదే సమయమున మాక్సుముల్లరు ఇంటిలోపల తనగదిలో కూర్చుండి యజుర్వేదముయొక్క అనువాదము ఇంగ్లీషులోనికి గావించుచుండిరి. అప్పుడొక కఠినమైన సంస్కృత పదము వారికి సందర్భించగా, దానికిసరియైన ఇంగ్లీషు పదమేదియో యని దీర్ఘముగా విచారించుచుండిరి ఎంత విచారించినను, వారికి ఆ సంస్కృతపదము యొక్క అర్థము గాని, దానికి సరియైన ఇంగ్లీషు పదము గాని స్ఫురణకు రాకుండెను. అత్యవసరమున నతడు తన మనంబులో నీట్లు భావించుకొనుచుండెను భారతదేశము వేదములకు పుట్టిల్లు అచట వేదశాస్త్రములను క్షుణ్ణముగ తెలిసిన విద్వాంసులెందఱో ఉందురు. వేదముల లోని ప్రతిపదమునకు అర్థమును వారు వివరించి చెప్పగలరు. అయితే వారి సహాయము ఇపుడు నాకెట్లు లభించగలదు? దాదాపు నాలుగువేల మైళ్ళ దూరమున నున్న భారతదేశవాసులలో నాకిపుడు సంబంధమెట్లు కలుగగలదు? వేదాధ్యయన కుశలుడగు పండితు డెవడైన భారతదేశమునుండి ఇచ్చోటికి వచ్చినచో ఈ సమయమున నాకెంత మేలు కలుగును? నా అనువాదము నిరాటం కముగ సాగిపోవునుగదా? కాని ఇది యంతయు నా ఊహాప్రపంచము, ఎక్కడ భారతదేశము ఎక్కడ లండన్ పట్టణము!

అని ఈ ప్రకారముగ ఋషివర్యుడగు ఆ మాక్సుముల్లరు తలపోయుచుండగా ఇంతలో సేవకు డొకడు వచ్చి ఒకచీటి తెచ్చి వారికిచ్చెను. ఆ చీటిలో ఇట్లు కలదు. Trivedi from india has come for interview "భారతదేశమునుండి త్రివేది అనువారు శ్రీవారిదర్శనమునకై వచ్చిరి" ఆ వాక్యములను చదువగనే మాక్సుముల్లరుగారికి పరమానందము కలిగెను. ఒడలంతయు గగుర్పాటు జెందెను. "ఓహో! "త్రివేది" అనగా మూడువేదములను చదివినవారెవరో ఇచటికి వచ్చినారు! ఒక వేదమే కాదు. మూడు వేదములు. నా అదృష్టము పండినది. చక్కని ఘనపాఠి భారతదేశమునుండి ఇచ్చటకు వచ్చినాడు. అతనివలన నా సంశయము తీర్చుకొందును!' అని తలంచి వెంటనే వారిని లోనికి తీసుకొని రావలసినదిగా సేవకుని ఆజ్ఞాపించెను. త్రివేది లోనికి రాగానే వారికి సముచిత ఆసన మొసంగి గౌరవించెను. అపుడు వారిరువురకును ఈ క్రింది సంభాషణము జరిగెను.

మాక్సుముల్లరు: మీరెవరు?

త్రివేది: నేను భారతదేశమునుండి ఐ.సి.యస్. పరీక్షకొఱకై చదువుటకు లండన్ వచ్చిన విద్యార్థిని.

మా: మీరు నాయొద్దకు వచ్చిన పనియేమి?

త్రి: మా పరీక్షలు పూర్తి అయినవి. తిరిగి భారతదేశమునకు బోవుచున్నాను. తమకీర్తి విని తాము భారతావనికి పరమ ఆప్తులని తెలిసికొని తమదర్శనము చేసికొని వెళ్ళుటకై వచ్చినాను.

మా: ఇపుడు స్వదేశమునకు బోయి మీరేమి చేయుదురు?

త్రి: నేను చదివిన పరీక్ష చాలపెద్దది (I.C.S.). అందు ఉత్తీర్ణుడు కాగానే ప్రభుత్వమువారే నాకొక పెద్ద ఉద్యోగమును కల్పించెదరు.

మా: ఉద్యోగము వచ్చిన పిదప మీరేమి చేయుదురు?

త్రి: నా విధులను సక్రమముగ నిర్వహించుచు ప్రభుత్వము వారిచ్చు నెలకు వెయ్యిరూపాయల జీతముతో నా జీవితము హాయిగా గడుపుదును.

మా: తరువాత ఏమి చేసెదరు?

త్రి: వివాహము చేసికొందును.

మా: తరువాత?

త్రి: ఇక తరువాత చెప్పవలసిన పనియేమి? ఒకటి, రెండు మూడు... ఇంటినిండా సైన్యం.

మా: ఓహో! సంతానమా! సరే, తరువాత!

త్రి: పిల్లలు, నేను, నా సంసారము, నా ఆనందము! జీవితమును హాయిగ వెళ్ళబుచ్చెదను.

మా: తరువాత?

త్రి: తరువాత కొంతకాలమునకు నా వయఃపరిమితి 55 సం కాగా ఉద్యోగమునుండి రిటైర్ అగుదును.

మా: తరువాత?

త్రి: తరువాత ఇక ఏమియు పనిఉండదు కావున తీరికగా కాలం గడుపుదును.

మా: తరువాత?

త్రి: వృద్ధుడ నగుదును

మా: తరువాత?

త్రి: చనిపోవుదును.

మా: తరువాత?

త్రి: మహాప్రభో! ఆ తరువాత విషయము నాకు తెలియదు క్షమింపుడు.

మా: మీరెవరో అంతయు తెలిసినవారని నేను మొదటలో ఊహించితిని. భారతదేశమునుండి వచ్చినవారు కాబట్టి ప్రాచీన సంస్కృతి బాగుగ ఎఱిగియుందురని భావించితిని. త్రివేది అను పేరు వినగనే మూడు వేదములన్నీ మికు కంఠస్థములై యుండునని తలంచితిని. తీరా విచారించుసరికి భారతీయ వేదాంతవ్యాయమందు మీకేమాత్రము పరిచయముగాని, అనుభవముగాని ఉన్నట్లు కనిపించలేదు.


మహాశయా! ఒక్కమాట వినుడు. జీవించి యున్నపుడు మానవుడు అనుభవించు భోగభాగ్యములుగాని, ప్రాపంచిక విలాసములు గాని, ఐశ్వర్యములుగాని గొప్పకావు. మరణించిన వెనుక తానెట్టి స్థితిని బొందునో, తనయొక్క స్వరూపము వాస్తవముగ నెట్టిదో, దానిని తెలిసి కొనుటయే గొప్పవిషయము. తాను మరణించువాడు కాదనియు,భౌతిక స్వరూపముతోగాని, నామరూపాత్మకమగు దృశ్యముతోగాని తన కేలాంటి సంబంధము లేదనియు, తాను నిత్య శుద్ధ బుద్ధ ముక్తమగు ఆత్మ స్వరూపమని యెరుగుటలోనే మానవుని మానవత్వ మిమిడి యున్నది. మానవుడు జీవించునది అట్టి ఆత్మవిజ్ఞానము తెలిసికొనుట కొరకే. ఇట్టి స్వరూపానుభూతిని బడయుటకొఱకే అయియున్నది. కావున మీరే యుద్యోగమును చేసినను, ఏ రంగమున పనిచేసినను, మిమ్ములను మీరు తెలిసికొనుట చాల ఆవశ్యకము. తాను నాశరహితమగు ఆత్మయని ఏక్షణమున మానవుడు తెలిసికొనునో, ఆక్షణముననే తన జన్మ సార్థకమైనదని యతడు తలంపవలెను. జీవితలక్ష్యమగు ఆత్మ సాక్షాత్కారమును మనుజుడు ఎంత శీఘ్రముగా బడయగల్గునో అంతధన్యుడు కాగలడు. కాబట్టి మీ లౌకికజీవనముతో బాటు పారమార్థిక విజ్ఞానమునుగూడ అభివృద్ధి పరచుకొనుడు. మీ పూర్వీకులగు మహర్షులయొక్క పవిత్రరక్తము మీలో ప్రవహించు చున్నది. ఈసత్యమును మీరేనాటికీ మఱువకుడు. మీరు మహర్షుల యొక్క సంతానమను విషయమును ఎన్నడును విస్మరింపకుడు!

మాక్సుముల్లరు యొక్క ఆగంభీరవిజ్ఞాన పరిపూర్ణములగు వాక్యములను వినగనే భారతవిద్యార్థియొక్క హృదయమునందు ఆధ్యాతికస్పందనము మెఱపువలె ఒక్క పర్యాయ మావిర్భవించెను. అతడు తన భావిజీవితమునుగూర్చి తీవ్రముగ పర్యాలోచింపదొడగెను. ఋషివర్యుని వాక్యములచే అతనికి కనువిప్పు కలిగెను. అప్పటి నుండియు అతడు దైవదృష్టిని చక్కగ అలవఱచుకొని జీవితమును సద్వినియోగ పరచుకొనెను.

**నీతి:- అశాశ్వతపదార్థములకై జీవితమును ధారబోయక శాశ్వత పరమాత్మకొఱకే యత్నించి జీవితమును సార్థకమొనర్చుకొనవలెను.**

# తెలుగువారందరూ ఇళ్లల్లో తెలుగే మాట్లాడాలి

**తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని, తెలుగు వారిని ఎక్కడ ప్రస్తావించిన , సంబరపడి నెత్తికెత్తుకుని ఆనందంతో పొంగిపోయే వారిలో నేనొకడ్ని , అదీ ప్రభుత్వం తరపున ప్రస్తుతిస్తే ఆనందం రెట్టింపు అవుతుంది. ప్రపంచ తెలుగు మహాసభలు జనవరి 3 , 4 , 5 తారీఖులలో గుంటూరు లో జరిగాయి. ఆ వేదిక పై ప్రసంగాలలో ప్రముఖులవి కొన్ని......**



**గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబునాయుడు**
**ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్**

తెలుగు జాతి అగ్రస్థానంలో నిలపాలి. ఇజ్రాయెల్ యూదుల్లా తెలుగు జాతి కూడా 2047 నాటికి ప్రపంచంలోనే శక్తివంతంగా ఎదగాలి. హిందీ తరువాత దేశంలోనే రెండో భాషగా తెలుగు వెలుగొందుతోంది . మన భాషను మరవొద్దు. తెలుగు భాషను కాపాడుకునే బాధ్యత మనందరిపై వుంది. అమ్మ భాష లేకపోతే జీవితానికి అర్ధమే లేదు. ప్రతి ఒక్కరు మాతృభాష నేర్చుకోవాలి. మన దేశంలో ఆరు భాషలకు ప్రాచీన హోదా వుంది. హిందీ, బెంగాలీ, మరాఠీ, తరువాతి స్థానం తెలుగుదే. సంతలు, పొడుపు కథలు, నానుడులు మన భాషలోనే చూస్తాం. ఒకరి భాషను మరొకరు గౌరవించాలి. ఈ భాష ఎక్కువ కాదు, తక్కువ కాదు. మాతృభాషలో అభ్యసించినవారే అత్యంత ప్రతిభావంతులుగా అవుతారు. కవిత్రయం నుండి అష్ట దిగ్గజాల వరకు, గురజాడ నుంచి శ్రీ శ్రీ, దాశరథి వరకు ఎందరో మహానుభావులు తెలుగు భాష కోసం కృషి చేసారు.

వేమన, సుమతి, భాస్కర శతక పద్యాలను మరచిపోలేము. అన్నమయ్య , వెంగమాంబ, మొల్ల భక్తి మార్గంలో తెలుగు కు వెలుగు తెచ్చారు. తొలి భాష ప్రయుక్త రాష్ట్రాన్ని తెచ్చిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరువలేము . తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసిన అన్న ఎన్టీఆర్ ను, వ్యావహారిక భాషా పితామహుడు గిడుగువారిని , జ్ఞానపీఠ్ అవార్డుతో తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని చాటిన విశ్వనాథ , సీనారే , రావూరి భరద్వాజ వంటి గొప్పవారు మన తెలుగు వారు . ఆంధ్ర తెలంగాణ కలిసే సమయంలో ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బూర్గుల రామకృష్ణారావుగారిని మరువగలమా ,తెలుగు దినపత్రికను నెలకొల్పి తెలుగు భాషకు సేవలందించిన రామోజీరావు త్యాగాలను మరువలేము.

ప్రస్తుత సమాజంలో ఇంగ్లీష్ చాలా అవసరం . అలాగని మాతృభాషను మర్చిపోవద్దు. అమెరికా లో వున్నా కేంద్రమంత్రి పెమ్మసాని వారి పిల్లలను పెంచినట్లు పెంచితే తెలుగు భాషకు ఎటువంటి ప్రమాదము ఉండదు. ఇంకా చెప్పాలంటే తెలుగు జాతి టెక్నాలజీలో ముందుండాలి.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతోనే భాషా రక్షణ సాధ్యమవుతుంది. అందుకే ఎన్ని పనులున్నా ఏటా నారా వారి పల్లెకు వెళ్లి గడపాలని నా భార్య భువనేశ్వరి కోరారు. ఆ సంప్రదాయాన్ని 20 ఏళ్లుగా కొనసాగిస్తున్నాము. అంటూ తెలుగును గురించి ఆయన ప్రసంగం సాగింది.

❖❖❖



**శ్రీ ఎం వెంకయ్య నాయుడు**
**మాజీ ఉప రాష్ట్రపతి**

మనం ఇళ్లలో తెలుగు భాషనే మాట్లాడుకోవాలి. మాతృ దేశాన్ని , మాతృ భూమిని , మాతృ మూర్తిని , మాతృ భాషను మరచిన వారు ఎన్నటికీ పరిపూర్ణ వ్యక్తులు కాలేరు. గుడిలో , బడిలో, అమ్మ ఒడిలో మాతృభాషనే మాట్లాడాలి. ఇంగ్లీష్ వస్తేనే రాణిస్తామనేది అపోహ మాత్రమే నన్నారు.

❖❖❖

**నూతలపాటి వెంకట రమణ**
**మాజీ ప్రధాన న్యాయమూర్తి**



భాష అంతరిస్తే జాతి అంతరించినట్లే. తెలుగు అభ్యసిస్తే ఉద్యోగాలు రావని జరిగే విష ప్రచారాన్ని అడ్డుకోవడంలో భాషాభిమానులు విఫలమవుతున్నారని అన్నారు. పిల్లలకు తెలుగుపై మమకారం పెంచేలా తల్లితండ్రులు కృషి చేయాలన్నారు .కొన్ని రాష్ట్రాలలో మాతృ భాషను బోధించే పాఠశాలలు కూడా లేవని , ఇది ఎక్కువగా ఆంధ్ర ప్రదేశ్ లోనే కనిపిస్తుందన్నారు. ప్రాథమిక విద్య తెలుగులోనే ఉండాలని సూచించారు. ప్రైవేట్ , ప్రభుత్వ విద్యా సంస్థలలో విధిగా తెలుగు శాఖను ఏర్పాటు చెయ్యాలని సూచించారు.

❖❖❖



**జస్టిస్ కృష్ణ మోహన్**
**హై కోర్ట్ న్యాయమూర్తి**

పిల్లలకు తెలుగు భాషపై మక్కువ పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఇంట్లో అందరు తెలుగులోనే మాట్లాడటం, రాయటం, చదవడం చేయాలన్నారు. పిల్లలు ఏ సిలబస్ చదివిన ద్వితీయ భాషగా తెలుగు ఉండాలన్నారు. ఏ భాషలో చదివినా ఉద్యోగావకాశాలు ఉన్నాయనే నమ్మకాన్ని పెంపొందించగలగాలన్నారు. తెలుగు కోసం సేవ చేసిన మహనీయుల విగ్రహాలను అమరావతి లో ఏర్పాటు చేసి వారి గురించి పిల్లలకు తెలియ జేయాలన్నారు.

**ఇంతమంది తెలుగు పెద్దలు గుంటూరు లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై తెలుగు భాష ప్రాముఖ్యాన్ని ప్రస్తావించటం చాలా సంతోషాన్ని కలిగించింది. వారి మాటలను మీతో పంచుకోవాలనే ఇక్కడ ప్రచురించి, తెలుగు కు పూర్వ వైభవం వస్తుందని మనందరం ఆశావాహకంగా ఉందాం. ఆ రోజు కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తూ వేచి ఉందాం.**


అజంతా
సుగంధ వక్క పలుకులు
సంప్రదాయ తాంబూల వక్కపలుకులు
Ajantha Dr. K. Sankar Rao
IVF-TN STATE
VIBHAG PRESIDENT
Srimathi. Vijayalakshmi Sankar Rao
Ex-State President
Tamilnadu Arya Vysya Mahila Vibhag
கோமாதா
விஸ்வமாதா
"సర్వేజనా సుఖినో భవంతు:"
AJANTHA
SUGANDHI SUPARI
TRADITIONAL THAMBULA BETEL NUT PIECES
அஜந்தா
சுகந்த பாக்கு
சம்பிரதாய தாம்பூல பாக்கு
అజంతా
సుగంధ వక్క పలుకులు
సంప్రదాయ తాంబూల వక్కపలుకులు


గోపురం
పసుపు పొడి
మరియు కుంకుమ
turmeric POWDER
GOPURAM
TRADE MARK
GOPURAM
KUMKUM
Y.V.S. & CO., MADRAS.
VISIT US AT
Website : www.gopuramproducts.com
Email : yvs@gopuramproducts.com